సమగ్ర సమాచార పత్రిక


# ముద్ర

హైదరాబాద్
శనివారం 04.04.2026

@mudranews mudratv

సంపుటి: 13 సంచిక: 162
పేజీలు: 12 వెల: రూ. 5


# సీక్రెట్ ఎఫైర్స్..



## డేటింగ్ యాప్ లో మహిళలే ఫస్ట్

రెండేళ్లలో పెరిగిన యాప్ వినియోగం

తొలి రెండు స్థానాల్లో బెంగళూరు.. హైదరాబాద్

ముద్ర, తెలంగాణ బ్యూరో :

వివాహేతర బంధాలు బలపడుతున్నాయి. ముఖ్యంగా వివాహేతర సంబంధాల కోసం ఈ యాప్‌లను వినియోగించే వారి సంఖ్య రెండేళ్లలో అమాంతం పెరిగిందని 'గ్లీడెన్' అనే ప్రముఖ డేటింగ్ యాప్ నిర్వహించిన సర్వేలో తేలింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మనుషుల మధ్య దూరాన్ని తగ్గిస్తోంది నిజమే కానీ, అదే సమయంలో పవిత్రమైన వివాహ బంధాల మధ్య అగాధాన్ని కూడా సృష్టిస్తోంది. తాజాగా వెల్లడైన ఒక సర్వే నివేదిక షాకింగ్ నిజాలను బయటపెట్టింది. భారతదేశంలో డేటింగ్ యాప్స్ వాడకంలో మహిళలు పురుషుల కంటే ముందంజలో ఉన్నారని, ముఖ్యంగా వివాహేతర సంబంధాల కోసం ఈ యాప్‌లను వినియోగించే వారి సంఖ్య రెండేళ్లలో అమాంతం పెరిగిందని 'గ్లీడెన్' అనే ప్రముఖ డేటింగ్ యాప్ నిర్వహించిన సర్వేలో తేలింది.

..మిగతా 2లో




## ఈ నెలలోనే రైతు భరోసా రెండో విడుత

9

నిధుల సర్దుబాటుకు సీఎం ఆదేశం

రూ. 2,650 కోట్లకు గ్రీన్ సిగ్నల్

కొత్తగా అప్లై చేసిన వారికి కూడా విడుదల



## రేవంత్ పోవాలి.... మార్పు రావాలి


3

మాజీ మంత్రి జీవన్ రెడ్డి

రెండేళ్లలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజా వ్యతిరేకత, అసంతృప్తి

నా అడ్డు తొలగించుకునేందుకే నామినేటెడ్ పదవుల్లో జాప్యం చేశారు

కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణపై రాష్ట్ర సర్కార్ నిర్లక్ష్యం



# అప్పులే.. ఆస్తులు లేవు

కాగ్ చెప్పిన వాస్తవం

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదేమిటి..?

ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పినట్టేనా..

బడ్జెట్ లో కేటాయింపులే ఘనం

వ్యయం చేయడంలో విఫలం

ప్రభుత్వానికి సవాల్ మారిన ఫైనాన్సియల్ రిపోర్ట్

ఎలా సర్దుబాటు చేయాలనేదానిపై త్వరలో ఆర్థిక కమిటీ..?

రానున్న రెండేళ్లు అసలు టార్గెట్



ముద్ర, తెలంగాణ బ్యూరో :

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో ఉందని కాగ్ నివేదిక తేల్చింది. కాగ్ పెట్టిన అసలు చిచ్చు.. ఇప్పుడు ప్రభుత్వ యంత్రాగాన్ని ఆయోమయంలో పడేస్తోంది. దీనితో ఆర్థికంగా ఎలా సర్దుబాటు చేయాలనే ఆమోయమంలో సర్కారు పడింది. దీనికోసం ఫైనాన్సియల్ అడ్జెస్ట్ మెంట్ కమిటీని వేయాలని సీఎం నేతృత్వంలోని టీం భావిస్తోంది. ఆర్థిక నిపుణులు, రిటైర్డ్ ఉన్నతాధికారులు, ఆర్థిక క్రమశిక్షణ అంచనా వేసే నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ప్రధానంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి ఎడాపెడా తెచ్చిన అప్పులను రాష్ట్రానికి ఆస్తులుగా మలచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) తేల్చి చెప్పింది.

**జాగ్రత్త.. లోటు బయటపడుతోంది**

రాష్ట్రాన్ని భారీ రెవెన్యూ లోటు దిశగా తీసుకెళ్తుతున్నారని కాగ్ చెప్పకనే చెప్పింది. 2024 25 ఆర్థిక సంవత్సరానికి విడుదల చేసిన రిపోర్టు లోనే కాగ్ ప్రభుత్వ లోపాల్ని తప్పు పట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదు అని చెప్పడానికి కాగ్ రిపోర్టు నిదర్శనం. బడ్జెట్లలో చెప్పేది ఒకటి, ఆచరణలో చేసేది మరొకటి అని రిపోర్టు తేటతెల్లం చేసింది. అంచనాలకు, చేస్తున్న ఖర్చులకు ఏమాత్రం పొంతనలేకుండా ఉంది. సంక్షేమ రంగానికి,

..మిగతా 2లో




# తీరని భూ సమస్య

## తిప్పలు పెడుతున్న భూ రికార్డులు



భూ భారతిలో రోజుకో మార్పు

సర్వే తర్వాతే రిజిస్ట్రేషన్

భూమి సమస్యలకు చెక్ పెట్టేలా ప్లాన్

మరికొన్ని మండలాల్లో అందుబాటులోకి భూభారతి పోర్టల్

ముద్ర, తెలంగాణ బ్యూరో :

భూముల సమస్యలు తీరడం లేదు. అప్పుడు ధరణి.. ఇప్పుడు భూ భారతి.. ఎన్ని మార్పులు జరిగినా లెక్కలు చిక్కడం లేదు. రిజిస్ట్రేషన్ సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి లో మార్పులు చేస్తూనే ఉన్నారు. భూముల సమస్యలు రాకుండా ఉండేందుకు రేవంత్ సర్కార్ భూభారతి పోర్టల్ ద్వారా పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేసేందుకు రెడీ అయింది. భూముల రిజిస్ట్రేషన్ కోసం.. ముందుగా సర్వే చేసి.. అక్కడి భూమికి, రికార్డుల్లో సమాచారం సరిపోలితేనే ఇక నుంచి రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. ఇక ఒక్కసారి రిజిస్ట్రేషన్ అయిన భూమి సర్వే నంబర్లు గానీ, విస్తీర్ణం గానీ మార్చే అవకాశం లేకుండా పక్కా చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమించినా భూభారతితో వారిని గుర్తించనున్నారు.

..మిగతా 2లో

## మాట మార్చిన కవిత

బీఆర్ఎస్ ఎత్తుగడ కోసమే ప్లాన్

ఇప్పటికే ప్రజా జాగృతి పేరుతో అప్లికేషన్..

తాజాగా టీఆర్ఎస్ పేరు వచ్చేలా కవిత వ్యాఖ్యలు

9






## సేవలన్నీ వాట్సాప్ లోనే..

9

మీ సేవ, ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ తిరగక్కర్లేదు!

80969 58096 నంబర్ ను సేవ్ చేసుకోండి

## భారత అమ్ములపొదిలోకి ఐఎన్ఎస్ 'అరిదమాన్', 'తారాగిరి'



అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ 'అరిదమాన్'

శత్రువులకు చిక్కని 'తారాగిరి' యుద్ధ నౌక

భారత నౌకదళం మరింత బలోపేతం

పాకిస్తాన్ వెన్నులో వణుకే..

10

# దక్షిణాసియా టెక్స్‌టైల్ రాజధానిగా తెలంగాణ

తెలంగాణ ప్రజల డీఎన్ఏలో టెక్స్‌టైల్స్

ప్రపంచం మొత్తం తెలంగాణలో తయారైన దుస్తులు ధరించాలి

నిర్దేశించుకున్న విజన్ లో పారిశ్రామిక వేత్తలు భాగస్వాములుకావాలి

13వ ఏషియా టెక్స్‌టైల్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

3




## మా చిత్తశుద్ధికి నిదర్శనమిది

ఉద్యోగ నియామకాలపై సుప్రీం తీర్పును స్వాగతించిన సీఎం రేవంత్

గ్రూప్ 1 నియామకాలకు లైన్ క్లియర్

హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకోబోమన్న సుప్రీం కోర్టు

9





2

వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

# ఏసీబీ దాడులు

బట్టబయలైన సబ్ రిజిస్ట్రార్ల అక్రమ లావాదేవీలు

వెలుగుచూసిన అనధికారిక వ్యక్తులతో చీకటి ఒప్పందాలు

70 డాక్యుమెంట్లు స్వాధీనం

డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల లంచాలు

ముద్ర, వరంగల్ :

వరంగల్ జిల్లాలో ఇద్దరు సబ్ రిజిస్ట్రర్ల అవినీతి బాగోతం బట్టబయలైంది. అక్రమ లావాదేవీలు, అనధికారిక వ్యక్తులతో వారు సాగిస్తున్న చీకటి ఒప్పందాలు వెలుగులోకి వచ్చాయి. తమ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులను అనధికారికంగా

..మిగతా 2లో



## పేదల ఇండ్లు కూల్చే మీ నుంచి మేం నేర్చుకోవాలా..?

10

సీఎం రేవంత్ పై కేరళం సీఎం పినరయి విజయన్ ఫైర్

తెలంగాణలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్నరు

కేరళం అభివృద్ధి గురించి మాకు పాఠాలు చెప్పొద్దు


అవినీతిలో ఆరో స్థానంలో తెలంగాణ

### ఇదీ ఏఐ ముద్ర

హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్‌లో ఎండీ షరీఫ్ అనే వ్యక్తి ఇంట్లో 20 తులాల బంగారాన్ని ఆయన కన్న కొడుకే జల్సాల కోసం చోరీ చేయడం పోలీసులను ముక్కున వేలేసుకునేలా చేసింది.



టాప్ 10 ల్యాప్‌టాప్‌లు :
ఆపిల్ మ్యాక్ బుక్ ఎయిర్ (M2 / M3)
అత్యంత స్మూత్ పనితీరు, బ్యాటరీ లైఫ్ అద్భుతం
వీడియో ఎడిటింగ్, స్టూడెంట్స్, ప్రొఫెషనల్స్‌కి బెస్ట్





## మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి
# సాదర స్వాగతం..

**ముద్ర, కరీంనగర్ :**

కరీంనగర్ జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి శుక్రవారం రాత్రి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో కరీంనగర్ ఆర్డీవో కే మహేశ్వర్ సాదర స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబోకే అందించి శాలువాతో సత్కరించారు. వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు)నాయకులు శ్రీనివాస్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆర్డిఓతో పలు అంశాలపై చర్చించారు. మీడియా అకాడమీ చైర్మన్ ను కలిసిన వారిలో సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి లక్ష్మణ్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఉషారాణి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్, వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు (ఐజేయు) గాండ్ల శ్రీనివాస్, జర్నలిస్టు యూనియన్ నాయకులు ఒంటెల కృష్ణ, ఎలగందుల రవీందర్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

# సీక్రెట్ ఎఫైర్స్..

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్‌కు రెండో స్థానం**

దేశవ్యాప్తంగా జరిగిన ఈ సర్వేలో గ్రేటర్ హైదరాబాద్ నగరం దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. డేటింగ్ యాప్స్ వినియోగదారుల్లో 18 శాతంతో బెంగళూరు మొదటి స్థానంలో ఉండగా, 17 శాతంతో హైదరాబాద్ తర్వాతి స్థానాన్ని ఆక్రమించింది. ఢిల్లీ (11%), ముంబై (9%) నగరాలు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఒకప్పుడు సాంప్రదాయాలకు నిలయంగా ఉన్న నగరాల్లో కూడా ఇప్పుడు 'సీక్రెట్ అఫైర్స్' సంస్కృతి వేగంగా విస్తరిస్తోందని ఈ గణాంకాలు హెచ్చరిస్తున్నాయి.

**మహిళల్లో పెరిగిన ఆసక్తికి కారణాలేంటి?**

సర్వే రిపోర్ట్ ప్రకారం, గత రెండేళ్లలో డేటింగ్ యాప్స్ ఉపయోగిస్తున్న మహిళల సంఖ్య 148 శాతం పెరిగింది. ఈ మార్పు వెనుక ఉన్న మానసిక మరియు సామాజిక కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇన్విజిబుల్ ఉమెన్ సిండ్రోమ్ కారణంగా పెళ్లైన చాలా ఏళ్ల తర్వాత కొంతమంది మహిళలు తమ భావాలను, శ్రమను ఇంట్లో ఎవరూ గుర్తించడం లేదని భావిస్తారు. అటువంటప్పుడు బయట వ్యక్తులు చిన్నపాటి పొగడ్త కురిపించినా లేదా ఆప్యాయంగా మాట్లాడినా అది వారికి ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తుంది.దీంతో ఎమోషనల్ అటాచ్‌మెంట్‌కు ప్రాధాన్యత పెరుగుతోంది. భర్తలు కెరీర్ లేదా ఇతర బాధ్యతలతో బిజీగా ఉండి భార్యతో సమయం గడపకపోవడం వల్ల, మహిళలు మానసిక ప్రశాంతత లేదా ఎమోషనల్ సపోర్ట్ కోసం బయటి వ్యక్తుల వైపు చూస్తున్నారు. దీనికి హార్మోన్ల ప్రభావం కూడా ఒక కారణమవుతోంది. సైన్స్ పరంగా కూడా మధ్య వయస్సులో మహిళల హార్మోన్లలో (ముఖ్యంగా ఈస్ట్రోజన్) మార్పులు రావడం వల్ల వారి ఆలోచనలు, భావోద్వేగాల్లో మార్పులు సంభవిస్తాయి. చివరకు కొత్తదనం మరియు థ్రిల్ కు ఇవన్నీ ప్రధానంగా నిలుస్తున్నాయి. నిత్యం ఒకే రకమైన రొటీన్ లైఫ్ నుండి బయటపడి, కొంత కొత్తదనం లేదా థ్రిల్ కోసం కూడా వివాహేతర సంబంధాల వైపు మొగ్గు చూపుతున్నట్లు సర్వేలో తేలింది.

**ఎలా వినియోగిస్తున్నారు..**

డేటింగ్ యాప్ యూజర్లు సగటున రోజుకు 1 నుంచి 1.5 గంటల పాటు ఈ ప్లాట్‌ఫారమ్‌లపై సమయం గడుపుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు మరియు రాత్రి 10 గంటల తర్వాత యాక్టివిటీ ఎక్కువగా ఉంటోందని నివేదిక పేర్కొంది. మహిళలు ఎక్కువగా ఆర్థికంగా స్థిరపడిన డాక్టర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు మరియు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను తమ భాగస్వాములుగా కోరుకుంటున్నట్లు సమాచారం. టెక్నాలజీ పుణ్యమా అని 'సీక్రెట్ అఫైర్స్' నిర్వహించడం గతంతో పోలిస్తే చాలా సులభమైంది. అయితే ఇది సమాజంలో అత్యంత గౌరవప్రదమైన వివాహ వ్యవస్థ ఉనికికే ముప్పుగా మారుతోందని సామాజిక విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దంపతుల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ తగ్గడం, పరస్పర గౌరవం పెరగడం వల్ల మాత్రమే ఇటువంటి పరిస్థితులను అదుపు చేయగలమని వారు సూచిస్తున్నారు.

# వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

(మొదటి పేజీ తరువాయి)

సదరు సబ్ రిజిస్ట్రర్ల అవినీతి లెక్క తేల్చే పనిలో ఏసీబీ నిమగ్నమైంది. శుక్రవారం వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలపై మెరుపు దాడులు నిర్వహించిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు.. సబ్ రిజిస్ట్రార్లు జమాల్పూర్ రామ్ నర్సింహారావు, దేవులూరి ఆనంద్ లు అవినీతి పాల్పడుతున్నట్లు గుర్తించింది. వీరిద్దరూ డాక్యుమెంట్ రైటర్లతో కలిసి రిజిస్ట్రేషన్ల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కేవలం ఈ అనధికారిక రైటర్లు పంపిన పత్రాలను మాత్రమే సబ్ రిజిస్ట్రార్లు ప్రాధాన్యత ఇచ్చి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఏసీబీ అధికారుల తనిఖీల్లో తేలింది. సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్ల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు వాట్సాప్ చాట్ ద్వారా బట్టబయలయ్యాయి. ఈ క్రమంలో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పూర్తి కాని సుమారు 70 డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది కాలంలోనే డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ఈ ఇద్దరు అధికారులు సుమారు రూ. 42 లక్షలను లంచంగా తీసుకున్నట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది.

**సబ్ రిజిస్ట్రార్ల నివాసాల్లోనూ..**

కార్యాలయంలో సోదాల అనంతరం ఏసీబీ బృందాలు ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. వీరి ఇళ్లలో లక్షలాది రూపాయల నగదుతో పాటు భారీగా అక్రమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు కనుగొన్నారు. ఇక్కడ ఓ షాకింగ్ అంశం వెలుగులోకి వచ్చింది. ఓ అధికారి ఇంట్లో రిజిస్ట్రేషన్ చేయని 254 ప్రభుత్వ పత్రాలు లభించడం అధికారులను సైతం విస్మయానికి గురిచేసింది. ప్రభుత్వ కార్యాలయంలో ఉండాల్సిన పత్రాలు అధికారుల ఇళ్లలో ఎందుకు ఉన్నాయనే కోణంలో ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఈ ఇద్దరు అధికారులపై ఏసీబీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న నగదు, డాక్యుమెంట్లు, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు.

# అప్పులే.. ఆస్తులు లేవు

(మొదటి పేజీ తరువాయి)

సాగునీటి రంగానికి ప్రభుత్వం బడ్జెట్ పత్రాల్లో భారీ గా నిధులు పెట్టి, ఆ తరువాత ఖర్చు పెట్టడంలో ఘోరంగా వైఫల్యం చెందిన విషయాన్ని కాగ్ తప్పుపట్టింది.

కేటాయింపులు మాత్రమే.. ఖర్చు ఊహించలేం

తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల తర్వాత వాస్తవానికి దగ్గరగా, ప్రణాళికాబద్ధమైన బడ్జెట్ ను ప్రవేశపెడుతున్నామని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 202425 వార్షిక బడ్జెట్ సందర్భంగా ప్రకటించారు. అసెంబ్లీలో సోమవారం నాడు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) విడుదల చేసిన నివేదికతో ప్రభుత్వ డొల్లతనం తేటతెల్లమైంది. 202425 వార్షిక బడ్జెట్ అంచనాలు రూ.2,21,242 కోట్లు ఉంటే, వాస్తవ కేటాయింపులు 1,67,804 కోట్లు మాత్రమేనని స్పష్టం చేసింది. అంటే బడ్జెట్ అంచనాల్లో చేరుకున్నది కేవలం 76శాతం మాత్రమే. రెవెన్యూ వ్యయం 2,20,945 కోట్లు ఉంటే, యాక్చువల్స్ 1,77,224 కోట్లు, అంటే చేరుకున్నది 80శాతం అని వెల్లడించింది. వార్షిక బడ్జెట్ అంచనాలకు, వ్యయానికి ఎంతో వ్యత్యాసం ఉంది. ఇక, రెవెన్యూ లోటు విషయానికి వస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర పరపతి దెబ్బతీసే విధంగా రికార్డు స్థాయిలో లోటును నమోదు చేసింది. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తరువాత తొలి వార్షిక బడ్జెట్ 201415కు రెవెన్యూ మిగులు రూ.368 కోట్లు ఉంటే, 202324కు రూ.779 కోట్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచింది. అయితే 202425 కు గాను రెవెన్యూ లోటు ను ఏకంగా రూ.9,420 కోట్లకు తీసుకువెళ్లింది. దేశంలో కోవిడ్ లాక్ డౌన్ సంవత్సరం మినహా ఎన్నడూ ఇంతగా రెవెన్యూ లోటు రాలేదు. అయినప్పటికీ రెవెన్యూ లోటు మాత్రం మైనస్ రూ.9,420 కోట్లకు ఎందుకు పోయిందో అర్థం కావడం లేదు. కాగ్ లెక్కుల చూస్తే బడ్జెట్ నియంత్రణ కోల్పోయి గాడి తప్పిందని స్పష్టంగా అర్థమవుతున్నది. 7 పద్దులు, 2 అప్రాప్రియేషన్స్‌లలో కలిపి మొత్తంగా రూ.31,229 కోట్ల ఖర్చు అదనంగా జరిగింది. ఆర్థిక క్రమ శిక్షణ లోపానికి, బడ్జెట్ అసమర్థన నిర్వహణకు ఇది మరో స్పష్టమైన ఉదాహరణ. ఇక రెవెన్యూ రిసిప్ట్స్ ద్వారా సమకూరిన రూ.1.67 లక్షల కోట్లలో 49 శాతం మొత్తాన్ని అనగా ఉద్యోగుల వేతనాలకు రూ.35,521 కోట్లు, వడ్డీలకు రూ.27,803 కోట్లు, పెన్షన్లకు రూ.16,942 కోట్లు ఖర్చు చేశారు.

గందరగోళం కొనసాగుతూనే ఉంది

రెవెన్యూ లోనూ ఇదే గందరగోళం ఉంది. బడ్జెట్‌లో రూ.40,453 కోట్లు పేర్కొంటూ, అదనంగా అంటే రూ.50,978 కోట్లు ఖర్చు చేసారు. అంటే 21 శాతం అధికంగా రూ.10,525 కోట్లు వ్యయం చేశారు. ఇక ఎఫ్.ఆర్.బీ.ఎం పరిధిలోని పరిధి అప్పుల విషయానికి వస్తే 202425కు గాను జీ.ఎస్.డీ.పీ లో 32.80శాతం ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ లక్ష్యాన్ని దాటి 34.29 శాతం పెంచారు. దీంతో అప్పు రూ.5,62,662 కోట్లకు చేరింది. అంటే ప్రభుత్వం తను పెట్టుకున్న పరిమితిని తానే దాటి ఆర్థిక క్రమశిక్షణను ఉల్లంఘించిందని కాగ్ వెల్లడించింది. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు రెవెన్యూ రిసిప్ట్స్ విషయంలో.. 202324లో స్టేట్ రెవెన్యూ రూ.1,11,798 కోట్లు ఉంటే, 202425కు రూ.1,09,233 కోట్లకు తగ్గింది. ఒక్క ఏడాదిలోనే సుమారు రూ.2,565 కోట్ల మేర స్టేట్ రెవెన్యూ తగ్గుదల నమోదైంది. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే మందగించిన ఆర్థిక వృద్ధి కారణం అన్నది సుస్పష్టం అవుతున్నది. రాష్ట్రానికి వచ్చే కేంద్ర పన్నుల వాటా తగ్గిందా అంటే అదీ లేదు.

**ఆదాయ వనరులు సమీకరణలో విఫలం**

202324లో రూ.23,742 కోట్లు ఉంటే, 202425కు రూ.27,050 కోట్లకు పెరిగింది. అదనంగా రాష్ట్రానికి కేంద్ర పన్నుల వాటా రూ.3,308 కోట్ల మేరకు పెరిగింది. కేంద్రం పన్నుల్లో రాష్ట్రం వాటా పెరిగింది. కానీ రాష్ట్ర రెవెన్యూ రెసిప్ట్స్ మాత్రం పెరగకపోవడం శోచనీయం. దీనికంతటికీ రాష్ట్రంలో తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు కారణంగా చెప్పుకోవాలి. వ్యాపారం, రియల్ ఎస్టేట్, పరిశ్రమలు ఇలా ఒక్కటి కాదు అన్ని రంగాలు కుదేలయ్యాయి. దీంతో జీఎస్టీ, ఆబ్కారీ, స్టాంప్ డ్యూటీ, వాహన పన్నులు వంటి ఆదాయ వనరుల్లో ఘణనీయమైన తగ్గుదల నమోదైంది. వాహనాల నుంచి వసూలు అయ్యే పన్నుల్లో రూ.7,095 నుంచి రూ.6,992 కోట్లకు తగ్గింది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ రాబడి రూ.14,296 కోట్ల నుంచి రూ.8,473 కోట్లకు తగ్గింది. స్టేట్ ఓన్ టాక్స్ రిసిప్ట్స్ (ఎస్‌ఓటీఆర్) రూ.1,11,798 కోట్ల నుంచి రూ.1,09,233 కోట్లకు తగ్గింది. రాష్ట్రం సొంత ఆదాయ వనరుల సమీకరణలో దారుణంగా విఫలమైందని కాగ్ రిపోర్టు స్పష్టం చేసింది. 202425కు గాను జీ.ఎస్.డీ.పీ వృద్ధి కేవలం 9శాతం మాత్రమే అని కాగ్ తేల్చి చెప్పింది. ప్రభుత్వం మాత్రం 202425 వార్షిక బడ్జెట్ లో వృద్ధి రేటు 10.6శాతం అంటూ ప్రచారం చేసుకున్నది. ఇది అబద్ధం అని కాగ్ రిపోర్టుతో వెల్లడైంది.

**వృద్ధి రేటు 9 శాతమే**

2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేస్తాం, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్తాం అని గొప్పలు చెబుతున్నారు. 1 ట్రిలియన్ డాలర్ అంటే.. ఇప్పుడున్న డాలర్‌రూపాయి విలువ ప్రకారం సుమారు 93 లక్షల కోట్లు. 3 ట్రిలియన్ల డాలర్లు అంటే.. 280 లక్షల కోట్లు. ఇది సాధ్యపడాలంటే.. వచ్చే ఎనిమిదేళ్లలో పాటు ప్రతి ఏటా వరుసగా 20.7 శాతం సీఏజీఆర్ (కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్) చొప్పున వృద్ధి సాధించాలి. కాగ్ రిపోర్టు ప్రకారం, కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన 9శాతం వృద్ధి రేటుతో వన్ ట్రిలియన్ డాలర్ అసాధ్యం అన్నది సుస్పష్టం అవుతున్నది.

**ఫెయిల్యూర్స్ పెరుగుతున్నాయా..?**

202324లో రూ.38,334 కోట్లు అప్పులు తీసుకోగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత 202425 వార్షిక బడ్జెట్ లో 56,209 కోట్లకు పెంచారు. గతంలో ఎన్నడూ లేనంతగా రుణాలు తీసుకున్నారు. ఇలా తీసుకున్న రూ.56,968 కోట్ల రుణాల్లో రూ.36,072 కోట్లు మాత్రమే ఆస్తుల పెంపుదలకు వినియోగించారు. రుణం ద్వారా తెచ్చుకున్న నిధులను క్యాపిటల్ ఎక్స్ పెండీచర్ గా మార్చడంలో తీవ్రంగా విఫలమయ్యారని కాగ్ స్పష్టం చేసింది. ఎడాపెడా తెచ్చిన రుణాలు, నిధులను మాత్రం మూలధన పెట్టుబడిగా మార్చడం లేదు. బడ్జెట్ లో ప్రతిపాదించిన ప్రకారం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు, కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ.4,054 కోట్లు, హైద్రాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజీ బోర్డుకు, మిషన్ భగీరథకు, స్వచ్ఛ భారత్ మిషన్ కు రూ.1386 కోట్లు, స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ (ఎస్.డీ.ఎఫ్) ఫర్ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ యాక్టివిటీస్, నియోజకవర్గాల అభివృద్ధి కార్యక్రమాలకు రూ.1201 కోట్లు ఖర్చు చేయకుండా మిగుల్చుకున్నారని కాగ్ తేటతెల్లం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అప్పులు రాష్ట్రానికి సంపదగా మారడం లేదని కాగ్ కుండబద్దలు కొట్టింది.

సంక్షేమం ఉత్తిమాటేనా..?

సాంఘిక సంక్షేమం విషయంలో మీరు చేసిన ఖర్చును చూస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలపై మీకున్నది పెదవుల మీద ప్రేమనే అన్నది స్పష్టం అవుతుంది. సోషల్ వెల్ఫేర్ కోసం రూ.25,971 కోట్లు కేటాయిస్తే.. చేసిన ఖర్చు కేవలం రూ.9,721 కోట్లు. ఈ వర్గాల కోసం కేటాయించిన నిధుల్లో 37శాతం కోత పెట్టారనేది స్పష్టమవుతున్నది. ముఖ్యమంత్రి మొదలు మంత్రుల వరకు తమది సంక్షేమ ప్రభుత్వం అని, గరీబీ హటావో ప్రభుత్వం అని ప్రతి వేదిక మీద చెప్పుకుంటున్నా వాస్తవంగా బడ్జెట్ కేటాయింపుల ప్రకారం వ్యయం జరగడం లేదు. మాటలు కోటలు దాటడం తప్ప, ఎస్సీ, ఎస్టీ, బీసీల మీద ప్రేమను నిధులు ఖర్చు చేసి చూపించడం లేదన్నది కాగ్ రిపోర్టుతో స్పష్టం అయ్యింది.

**సీపీఎస్ సొమ్ము వాడేశారు**

2004 సంవత్సరం సెప్టెంబర్ 1వ తేదీన ప్రారంభించిన నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్.పీ.ఎస్) ప్రకారం ప్రతి నెలా ఉద్యోగులు తమ వేతనంలో నుంచి కాంట్రిబ్యూట్ చేస్తున్న రూ.10 శాతం మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా సమకూర్చాలి. ఇలా సమకూరిన మొత్తాన్ని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్.ఎస్.డీ.ఎల్) లేదా ట్రస్టు బ్యాంకు లో జమ చేయాలి. మార్చి 31వ తేదీ 2025 నాటికి రూ.1,079 కోట్లు మాత్రమే డిపాజిట్ చేసి రూ.3,213 కోట్లు పెండింగ్ లో పెట్టింది. ఉద్యోగులు ఎంత చెల్లించాలి, ప్రభుత్వం తన వాటాగా ఎంత సమకూర్చాలనే దానిపై స్పష్టత లేదని కాగ్ లేవనెత్తింది. ట్రస్టు బ్యాంకులో బదలాయించకుండా తన ఖజానాలోనే పెట్టుకున్న రూ.3.213 కోట్లకు వడ్డీ చెల్లించాలని కాగ్ స్పష్టం చేసింది.

# తీరని భూ సమస్య

(మొదటి పేజీ తరువాయి)

**సమస్యలు తీరేనా..?**

భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో ఎన్నో సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. క్షేత్ర స్థాయిలో ఉన్న భూమికి, రికార్డుల్లో ఉన్న భూమికి అసలు పొంతన ఉండదు. ప్రభుత్వ భూములు, ఇతరుల భూమిని ఆక్రమించి ఉన్న భూముల కంటే ఎక్కువ భూములను రిజిస్ట్రేషన్లు చేసుకునే వారు ఉంటారు. ఇక క్షేత్ర స్థాయిలో ఎక్కువ భూమి ఉన్నా.. రికార్డులు సరిగా లేకపోవడం వల్ల పట్టా పాసు పుస్తకాల్లో తక్కువ భూమి రిజిస్ట్రేషన్ కావడం వంటి ఘటనలు చూస్తూనే ఉన్నాం. దీంతో రైతులు పంట పండించడం కంటే ఎక్కువగా భూరికార్డుల సవరణ కోసం అధికారుల చుట్టూ తిరగడమే ఎక్కువ అవుతోంది. ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో ఈ సమస్యలు మరిన్ని పెరిగాయని ఆరోపించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని సరిచేయడానికి భూభారతి పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు చెబుతోంది.

**మళ్లీ పైలట్ ప్రాజెక్టు మొదలు**

ఈ నేపథ్యంలోనే పైలట్ ప్రాజెక్టు కింద ఈ భూభారతి ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌ను అమలు చేసేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని 5 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి.. అమలు చేసేందుకు రెడీ అయింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో ఈ భూభారతి పోర్టల్ పైలట్ ప్రాజెక్టుగా గురువారం ప్రారంభమైంది. ఈ సమగ్ర భూభారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత.. నిజంగా ఉన్న భూమికి.. రికార్డుల్లో ఉన్న సమాచారం సరిగ్గా సరిపోతేనే భూ భారతి పోర్టల్లో భూమిని రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఇలా రిజిస్ట్రేషన్ అయిన తర్వాత రైతుకు పట్టాదార్ పాసు పుస్తకంతోపాటు భూధార్ నంబర్‌ను కూడా కేటాయిస్తారు. ఇలా చేయడం వల్ల భవిష్యత్‌లో ఆ భూమికి సంబంధించిన సర్వే నంబర్లను గానీ.. విస్తీర్ణాన్ని గానీ మార్చడానికి అవకాశమే ఉండదు. రాష్ట్రంలో భూముల వ్యవస్థను పకడ్బందీగా సరిచేసేందుకు రెవెన్యూ శాఖ ఈ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది.

**సరిపోల్చుతాయా..?**

ఇక ఈ భూభారతిలో భాగంగా సర్వే, రిజిస్ట్రేషన్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్లను కలిపి ఒకే పోర్టల్ కిందికి తీసుకువచ్చారు. సర్వే వివరాలు.. స్టాంపులురిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్న వివరాలు (22 ఎ, ఇతరత్రా), రెవెన్యూ శాఖ రికార్డుల్లో ఉన్న వివరాలు అన్నీ ఈ పోర్టల్లో అందుబాటులో ఉంచారు. మరోవైపు.. 2020 నవంబరు 2వ తేదీ నుంచి ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే అందులో ఏ సమాచారం ఉంటే దాని ఆధారంగానే భూముల రిజిస్ట్రేషన్ చేపట్టడంతో క్షేత్రస్థాయిలో భారీగా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వీటన్నింటినీ సరిచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను తీసుకొచ్చింది.

ఈ విధానంలో భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఇక నుంచి భూమిని సర్వే చేయడం తప్పనిసరి చేశారు. ఇందు కోసం మొదట ఇంటిగ్రేటెడ్ పోర్టల్లో భూ సర్వేకు దరఖాస్తు చేసుకోవాలి. ఆ భూమికి సంబంధించిన రెవెన్యూ దస్త్రాలు, సర్వే శాఖ వద్ద ఉన్న వివరాలతో సరిహద్దు రైతులకు సర్వేయర్లు నోటీసులు ఇస్తారు. తోటి రైతుల సమక్షంలోనే భూమిని సర్వే చేసి తహసీల్దార్లకు రిపోర్టు అందిస్తారు. ఆ తర్వాత రెవెన్యూ శాఖ.. రైతుకు సర్వే పటం జారీ చేస్తుంది. ఆ సర్వే పటం ఆధారంగా భూ భారతి పోర్టల్లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు రైతు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం క్షేత్రస్థాయిలో సర్వేలో ఎంత భూమి అయితే ఉంటుందో.. అంత భూమికే రిజిస్ట్రేషన్ చేస్తారు.

**అన్నీ చూసుకున్నాకే పాసు పుస్తకం**

రైతు చేసుకున్న దరఖాస్తుతోపాటు సర్వే పటం ఆధారంగా తహసీల్దార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కలిసి.. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తి చేసి పట్టాదార్ పాసుపుస్తకాన్ని జారీ చేయనున్నారు. దీంతోపాటు రైతుకు భూధార్ కార్డును కూడా జారీ చేస్తారు. ఆ భూదార్ కార్డులో భూమికి సంబంధించిన సమగ్ర వివరాలను పొందుపరుస్తారు. భూదార్ కార్డులో ప్రత్యేక సంఖ్య ఉండటం వల్ల దాన్ని మార్చడానికి వీలు లేకుండా చేశారు. ఈ ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో రైతులే స్వయంగా భూమి నక్షా, భూమి మార్కెట్ విలువ సహా కీలక విషయాలను తెలుసుకునే అవకాశం కల్పించారు. ఇక తమ పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కూడా కలుపుకుని.. చాలా మంది రైతులు పంట సాగు చేస్తూ ఉంటారు. ఇక అలాంటి భూములు కూడా రిజిస్ట్రేషన్ సమయంలో దొరికిపోనున్నాయి.

# మూడు రోజులు మోస్తారు వర్షాలు

## వాతావరణశాఖ హెచ్చరిక

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**


రానున్న 3 రోజుల పాటు తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన వాతావరణ శాఖాధికారులు... శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడే అవకాశముందని తెలిపారు. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# బీజేపీపై కేరళలో సీఎం అసత్య ప్రచారం

- **కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**
- **ఆరు గ్యారంటీల్లో ఎన్ని అమలు చేసిందో కాంగ్రెస్ చెప్పాలి**
- **గతంలో కేసీఆర్.. ఇప్పుడు రేవంత్ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కేరళ ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేశారని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిలో ఎన్ని నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏం చేశారని, కేరళలో రేవంత్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ చేసిన తరహాలోనే రేవంత్‌రెడ్డి కూడా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ బీసీలకు అన్యాయం చేసిందని ఆరోపిస్తోన్న కాంగ్రెస్ మరి ఆ వర్గానికి ఏం చేసిందో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసగించింది కాంగ్రెస్ పార్టీయేనని దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లు కేరళలో గొప్పలు పలుకుతున్న రేవంత్.. భవిష్యత్‌లో తెలంగాణలోనూ అదే తరహా మాటలు చెప్పే ప్రమాదముందని అన్నారు. పదేళ్ల పాటు కేసీఆర్ ప్రజలను మోసం చేస్తే, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే పని చేస్తున్నారని ఆరోపించారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
04.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ 10 ల్యాప్‌టాప్‌లుమియం డిజైన్,

డెల్ XPS 13ప్రీ మియం డిజైన్, చాలా తేలికగా ఉంటుందిడిస్ప్లే క్వాలిటీ చాలా షార్ప్ & క్లియర్



# ఆలయాలను అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 6న నిర్మల్ జిల్లాలోని బాసరలో పర్యటించనున్న సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ లతో కలిసి శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా బాసర అమ్మవారిని దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి ఆలయంలో పూజలు నిర్వహించే ప్రాంతంతో పాటు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసే ప్రాంతాలను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆలయ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాసర ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. బాసరతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలను అభివృద్ధి చేయనుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 6న ముఖ్య మంత్రి బాసర ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు చెప్పరు. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా, దర్శనా లు సౌకర్యవంతంగా పూర్తయ్యేలా తగిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, ఆలయ ఈవో విజయరామారావు, తహసీల్దార్ పవన్ చంద్ర, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఆత్మహత్య

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లా కడెం మండలం మాసాయిపేట్ సర్పంచ్ దుర్గం లహరిక శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. పురుగుల మందు తాగిన లహరిక ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో, కుటుంబ సభ్యులు ఆమెను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆసుపత్రికి తీసుకెళ్తున్న వాహనం మార్గ మధ్యంలో అదుపు తప్పి రోడ్డుపై నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నది. వెంటనే మరో వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



**లహరిక (ఫైల్)**

# అమెరికా యుద్ధోన్మాదం

- ప్రధాని మౌనం వీడాలి
- ట్రంప్ కు యుద్ధ కాంక్ష
- ఎగుమతి నిలిచిన రైతు ఉత్పత్తులు
- సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ




**ముద్ర, వరంగల్:** భారత దేశానికి నష్టం కలిగిస్తున్న అమెరికా యుద్ధోన్మాదంపై ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వీడాలని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారా యణ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధ కాంక్షతో అనేక దేశాలు ప్రభావితం అవుతున్నాయన్న ఆయన.. ఇంధన సరఫరాలో ఇక్కట్లతో పాటు దేశంలోరైతుల ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, బియ్యం ఇతర వస్తువుల ఎగుమతి నిలిచిపోయిందని చెప్పారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒకవైపు అమెరికాలోనే 50 రాష్ట్రాల్లో ట్రంప్ కు వ్యతిరేకంగా లక్షలాది మంది నిరసనలు తెలుపుతుంటే మన దగ్గర అసమర్థ ప్రధానిగా మోడీ బలహీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ పాల్గొని అనేక త్యాగాలు చేసిందని నారాయణ గుర్తు చేశారు. మావోయిస్టు ఉద్యమం నుండి విడిపోయి బయటికి వచ్చిన గద్దర్‌ను అమిత్ షా మావోయిస్టు అనడం దారుణమన్నారు. గద్దర్ చనిపోతే సంతాపం తెలిపినందుకు ప్రధాని మోడీని దమ్ముంటే అరెస్టు చేస్తారా అని, లేదా అసత్యాలు పలికిన అమిత్ షా పై కేసు పెడతారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ ఓటమితోనే రాజ్యాంగ పరిరక్షణ

**పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి**



**ముద్ర, పుదుచ్చేరి :** ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగం కల్పించిన గౌరవం, స్వేచ్ఛను కాపాడుకోవాలంటే పుదుచ్చేరిలో కాంగ్రెస్, డీఎంకే కూటమి బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీ తో గెలిపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చి పుదుచ్చేరిని రక్షించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్, పుదుచ్చేరి పీసీసీ అధ్యక్షుడు విద్యలింగం తో కలిసి పుదుచ్చేరి లోని మనవేలి అసెంబ్లీ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిచిన అనంతరామన్ కు, ఎంబాలం నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా బరిలో నిలిచిన లక్ష్మీకాంత న్ కు మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు.

# తెలంగాణ ప్రజల డీఎన్‌ఏలో టెక్స్‌టైల్స్

- దక్షిణాసియా టెక్స్‌టైల్ రాజధానిగా తెలంగాణ
- ప్రపంచం మొత్తం తెలంగాణలో తయారైన దుస్తులు ధరించాలి
- నిర్దేశించుకున్న విజన్ లో పారిశ్రామిక వేత్తలు భాగస్వాములు కావాలి
- 13వ ఏషియా టెక్స్‌టైల్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** వస్త్ర పరిశ్రమ రంగంలో 2047 నాటికి తెలంగాణను దక్షిణాసియాలోనే గొప్ప టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. టెక్స్‌టైల్ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్దేశించుకున్న విజన్‌కు అనుగుణంగా ప్రపంచాన్ని మార్చగల వాతావరణాన్ని సృష్టించడంలో తమతో భాగస్వామ్యం కావాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ప్రపంచంలోని ప్రతి దేశం తెలంగాణలో తయారైన దుస్తులను ధరించేలా చేయాలన్నది తమ సంకల్పమన్న సీఎం... తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో అందరూ భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ తో కలిసి 13వ ఏషియా టెక్స్‌టైల్ సదస్సును నిర్వహించింది. ఈ సదస్సులో సీఎం అటెక్స్‌కాన్–2026 నివేదిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్స్‌టైల్స్ తెలంగాణ ప్రజల డీఎన్‌ఏలో ఉందని వ్యాఖ్యానించారు. నిజాం కాలంలో ప్రపంచ నలుమూలల నుంచి వ్యాపారులు హైదరాబాద్ నగరానికి వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేశారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఈ విషయాన్ని గర్వంగా చెప్పగలదన్నారు. వస్త్ర పరిశ్రమలో తెలంగాణ ముందంజలో ఉండటానికి చారిత్రక కారణాలున్నాయని వివరించారు. దేశంలో పత్తి ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నామన్నారు. ఇక్కడి పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా పేరుందన్నారు.. టెక్స్‌టైల్ తెలంగాణకు కేవలం పరిశ్రమ మాత్రమే కాదు. ప్రజల జీవనాధారమని పేర్కొన్నారు. ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరలు, వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వరకు అనేకం ఇక్కడున్నాయని వెల్లడించారు. తెలంగాణలో నైపుణ్యం, మంచి సంకల్పం కూడా ఉందన్నారు. అందుకే డీప్‌టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ వంటి అనేక రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. వరంగల్‌లో కాకతీయ ప్రపంచ స్థాయి మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. అందులో అనేక అప్పరెల్ పార్కులున్నాయన్నారు. వస్త్ర పరిశ్రమకు తమ ప్రభుత్వం భూమి, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తుందని చెప్పారు. అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేస్తుందన్నారు. ప్రపంచ పోటీకి అనుగుణంగా విధానాలు అనుసరిస్తున్నామన్న సీఎం... అత్యుత్తమ మానవ వనరుల బలం ఉందని వివరించారు. తెలంగాణలోని పత్తి పొలాలకు.. లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ షోలకు అనుసంధానం కావాలని సీఎం ఆకాంక్షించారు. మీకు విజన్ ఉంటే, మేము సరైన భాగస్వాములం అవుతామని పారిశ్రామిక వేత్తలకు సీఎం కోరారు. అందరం కలిసి, ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్‌ను నిర్మిద్దామని పిలుపునిచ్చారు.

**సినిమా హబ్ గా హైదరాబాద్ :**

హైదారాబాద్ గ్లోబల్ సినిమా హబ్ గా ఎదుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇటీవల నెట్ ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోలను ఇక్కడ ప్రారంభించినట్లు చెప్పారు. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తుండగా, ఇప్పుడు హాలీవుడ్ కూడా చేరిందన్నారు. సినిమా సంబంధిత ఫ్యాషన్ రంగాన్ని కూడా తెలంగాణ నుంచే అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సీఎం తెలిపారు. గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామనీ అలాగే సంప్రదాయ ఆలోచనలతో పాటు ఆధునిక పరికరాలతో కలిపి డిజైన్, కట్టింగ్, స్టిచింగ్‌లో యువతకు ముఖ్యంగా మహిళలకు శిక్షణనిస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సదస్సులో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర రావు, అధికారులు, జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అధికార పార్టీ నేతలను తిరగనివ్వం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటోన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించకపోతే.. మంత్రులు, ఎమ్మెల్యేలను రాళ్లతోని కొట్టిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అధికార పార్టీ నేతలను బయట తిరగనివ్వబోమని స్పష్టం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకోకూడదనే దురుద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించడం లేదని ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. పిల్లలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వందల సార్లు ధర్నాలు, పోరాటాలు చేశామన్నారు. దివంగత సీఎం వైఎస్ఆర్ పేద విద్యార్థులకు న్యాయం జరగాలని, నేటి సీఎం మాత్రం దాన్ని ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ప్రతి పక్షాలు సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వాకౌట్ చేయలేదని మండిపడ్డారు.



# బీఆర్ఎస్ హయాంలోనే గిరిజనుల సంక్షేమం

- మాజీ మంత్రి హరీష్ రావు

**ముద్ర, నారాయణపేట :** తెలంగాణలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని మాజీ మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. తమ పాలనలో ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రూ.వేల కోట్లు ఇచ్చామన్న హరీశ్‌రావు ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా ఇవ్వడం లేదని ఆక్షేపించారు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని తిమ్మారెడ్డి పల్లి, కొత్తపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.వంద కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్టీల ఓట్లు కావాలి గానీ, వాళ్ల సంక్షేమం పట్టించుకోరా?అని ప్రశ్నించారు. కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామని బడాయి మాటలు చెబుతున్నారని విమర్శించారు.దశాబ్దాల కాలంగా గిరిజనులు కలలుగన్న "మా తండాలో మా రాజ్యం" నినాదాన్ని నిజం చేసింది కేసీఆర్ మాత్రమేనని హరీష్ రావు గుర్తు చేశారు.





# మత సామరస్యానికి ప్రతీక

- 11 రోజుల పాటు హనుమాన్ దీక్ష
- కొండగట్టులో మాల విరమణ


**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ఓ ముస్లిం యువకుడు హనుమాన్ దీక్ష స్వీకరించి మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న సంఘటన జగిత్యాల జిల్లాలో చోటు చేసుకుంది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరు గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ 11 రోజుల పాటు హనుమాన్ దీక్ష స్వీకరించాడు. గతంలో అయోధ్య నుంచి పూడూరు వరకు శ్రీరామచంద్రుడి పాదుకలను పాదయాత్రగా తెచ్చే కార్యక్రమంతో పాటు రామాలయం నిర్మాణంలో కూడా చురుగ్గా పాల్గొన్నాడు. హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టుకు వెళ్లి మాల విరమణ చేశాడు. అన్ని మతాలు సమానమనే సందేశానిస్తున్న యూసుఫ్ ను గ్రామస్థులు అభినందించారు.

## మూసీ శుద్ధీకరణ ముందా?

# పూజా స్థలాల నిర్మాణం ముందా?

- సీఎం కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

**ముద్ర, హైదరాబాద్:** మూసీ నది పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్జీజీ) స్వాగతించినప్పటికీ, నది పూర్తిగా శుద్ధి కాకముందే ఆలయాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చిల నిర్మాణాన్ని ప్రారంభించడం సరైనది కాదని అభిప్రాయపడింది. ఈ మేరకు ముఖ్యమంత్రికు సంస్థ అధ్యక్షుడు యం. పద్మనాభరెడ్డి లేఖ రాశారు. ఇటీవల మార్చి 29, 2026న మంచిరేవులలో ఒక ఆలయానికి సీఎం శంకుస్థాపన చేయడం, అలాగే మూసీ నది మధ్యలో 108 అడుగుల ఎత్తైన శివుడి విగ్రహంతో "ఓంకారేశ్వర ఆలయం" నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించడం పై ఫోరం ఆందోళన వ్యక్తం చేసింది. నది కాలుష్యం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయాలు పునఃపరిశీలించాలని సూచించింది. మూసీ శుద్ధీకరణకు గతంలో అనేక ప్రణాళికలు రూపొందించినప్పటికీ అవి ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని లేఖలో పేర్కొన్నారు. 2001లో వాటర్ బోర్డ్ రూపొందించిన ప్రణాళికకు కేంద్రం ఆమోదం ఇచ్చి రూ.405 కోట్లు ఖర్చు చేసినా ఫలితం కనిపించలేదని, తరువాత జీహెచ్ఎంసీ నిర్మించిన రూ.50 కోట్ల రబ్బర్ డ్యామ్ కూడా ప్రయోజనం లేక తొలగించబడిందని గుర్తుచేశారు. 2011లో "మూసీ ఫేజ్–II" పేరుతో రూ.750 కోట్ల ప్రణాళికను ప్రతిపాదించినప్పటికీ కేంద్రం ఆమోదించలేదని, అనంతరం 2012లో రూ.17,130 కోట్ల అంచనాతో సమగ్ర ప్రణాళిక రూపొందించినా డీపీఆర్ డీపీఆర్ లో లోపాల కారణంగా అమలు కాలేదని తెలిపారు. 2017లో ఎంఆర్డీసీఎల్ ను ఏర్పాటు చేసినప్పటికీ, గత తొమ్మిదేళ్లలో గణనీయమైన పురోగతి లేదని విమర్శించారు. నగరంలో ఆక్రమణలు, తగిన మురుగు నీటి శుద్ధి వ్యవస్థల లోపం వల్ల మూసీ నది డ్రైనేజ్‌లా మారిపోయిందని, శుద్ధి చేయని మురుగు నీరు, పరిశ్రమల వ్యర్థాలు నదిలో కలవడం వల్ల ప్రమాదకర రసాయన కాలుష్యం పెరిగిందని పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కూడా మూసీని అత్యంత కాలుష్యగ్రస్త నదిగా గుర్తించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం నది నీరు జలచర జీవులు, వ్యవసాయం, మానవ వినియోగానికి అనుకూలం కాని పరిస్థితిలో ఉందని ఫోరం పేర్కొంది. ఈ నేపథ్యంలో ముందుగా మూసీ నది శుద్ధీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అనంతరం మాత్రమే పూజా స్థలాల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రిని వినమ్రంగా కోరింది. కాలుష్యంతో నిండిన నది మధ్యలో శివ విగ్రహం ఏర్పాటు చేయడం కూడా సముచితం కాదని అభిప్రాయపడింది.



# రేవంత్ పోవాలి.. మార్పు రావాలి

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. "రేవంత్ పోవాలి.. మార్పు రావాలి" అనే పరిస్థితి ఏర్పడిందన్నారు. నామినేటెడ్ పదవుల్లో జాప్యం తనను పక్కన పెట్టడానికేనని ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల మరమ్మతులకు రూ.500 కోట్లలోపు ఖర్చవుతుందని చెప్పినా చర్యలు తీసుకోలేదన్నారు. ప్రాజెక్ట్ నిర్లక్ష్యంతో వ్యవసాయం, హైదరాబాద్ నీటి అవసరాలు ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఇదిలా ఉండగా, జీవన్ రెడ్డి త్వరలోనే తన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఈ నెల 13న ఆయన గులాబీ కండువా కప్పుకోబోతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అమెరికా పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 7న జగిత్యాలకు వెళ్లి జీవన్ రెడ్డితో భేటీ అవుతారని ప్రచారం జరుగుతోంది. కేటీఆర్ జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించనున్నట్లు తెలిసింది.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# రోగనిరోధక శక్తికి దివ్యౌషధం విటమిన్ సి




**ఏప్రిల్ 4 జాతీయ విటమిన్ సి దినోత్సవం**

తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నారా? చిన్న గాయాలు మానడానికి ఎక్కువ సమయం పడుతోందా? ఎప్పుడూ అలసటగా అనిపిస్తుందా? అయితే మీ శరీరంలో విటమిన్‌సి లోపం ఉండవచ్చు. ఇది మన రోగనిరోధక వ్యవస్థకు అత్యంత ముఖ్యమైన పోషకం. దీని లోపం వల్ల అనేక వ్యాధుల బారిన పడాల్సి వస్తుంది. మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాల్లో విటమిన్ సి కూడా ఒకటి. దీని రసాయన నామం ఆస్కార్బిక్ ఆమ్లం. దీని వల్ల శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అయితే కేవలం ఇదే కాదు, ఇంకా అనేక రకాల పనులకు కూడా మనకు విటమిన్ సి అవసరం అవుతుంది. విటమిన్ సి మనకు అనేక ఆహారాల్లో లభిస్తుంది.ఇది కణజాలాలకు మరమ్మత్తులు చేస్తుంది. కణాలను ఆరోగ్యంగా ఉంచుతుంది.ఎంజైమ్‌ల పనితీరు మెరుగు పడేలా చేస్తుంది.రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారేలా చేస్తుంది.దంతాలు,చిగుళ్లు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా విటమిన్ సి మనకు ఎన్నో రకాలుగా ఉపయోగం పడుతుంది. ఇది నీటిలో కరిగే విటమిన్. కనుక శరీరం ఈ విటమిన్‌ను నిల్వ ఉంచుకోలేదు.కాబట్టి ఈ విటమిన్‌ను మనం రోజూ తప్పనిసరిగా శరీరానికి అందించాల్సి ఉంటుంది.

' విటమిన్ సి '.. జలుబు, జ్వరాల వంటివి తగ్గించకపోవచ్చు. కానీ, అవి రాకుండా మాత్రం అడ్డుకోగలవు. మొదటి నుంచి మీకు 'విటమిన్‌సి' కలిగిన ఆహార పదార్థాలను తీసుకొనే అలవాటు ఉన్నట్లయితే.. రోగాలే దరిచేరవు. అంతేకాదు, ఈ విటమిన్ వల్ల ఇంకా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. రోగ నిరోధక వ్యవస్థకు రక్షణ కవచంగా ఉండటమే కాకుండా, కంటి సమస్యలు, చిన్నవయస్సుల్లోనే చర్మంపై వృద్ధాప్య చాయలు రావడం వంటి సమస్యలు లేకుండా చేస్తుంది.

తాజా పండ్లు, కాయగూరల్లో 'విటమిన్‌సి' పాళ్లు ఎక్కువగా ఉంటాయి. రోజూ క్రమం తప్పకుండా వీటిని తీసుకుంటూ ఉంటే.. శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని న్యూట్రిషియన్లు సూచిస్తున్నారు. కేవలం విటమిన్‌సి మాత్రమే కాకుండా, A, E, B విటమిన్స్ కూడా శరీరానికి అందినట్లయితే పూర్తి ఆరోగ్యం మీ సొంతమవుతుదని తెలుపుతున్నారు. వీటిలో ఉండే జింక్, క్రోమియం, కాల్షియం శరీరానికి అవసరమైన పోషకాలను అందించి రక్షణ కల్పిస్తాయని చెబుతున్నారు.

శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తికి విటమిన్ సి సాయపడతుంది. ఇవి ఇన్ఫెక్షన్లతో పోరాడి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. జలుబు, ఫ్లూ వంటి సీజనల్ ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో సాయపడుతుంది. అయితే, విటమిన్ సి లోపం మిమ్మల్ని అనేక వ్యాధులకు దగ్గర చేస్తుంది. అందుకే శరీరంలో కనిపించే కొన్ని లక్షణాల్ని ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయకూడదు. కొన్ని లక్షణాల్ని ముందుగానే గుర్తించి విటమిన్ సి లోపాన్ని భర్తీ చేయవచ్చు. విటమిన్ సి లోపాన్ని సాధారణంగా స్కర్వీ అంటారు. విటమిన్ సి లోపం ఉంటే కనిపించే లక్షణాలను ముందుగానే గుర్తిస్తే ప్రయోజనముంటుంది.

తరచుగా వ్యాధుల బారిన పడటం విటమిన్ సి లోపానికి ఇది అతి పెద్ద సంకేతం. తరచుగా జలుబు, దగ్గు లేదా ఫ్లూ వస్తే, మీ రోగనిరోధక శక్తి బలహీనపడుతుందని అర్థం. విటమిన్ సి లోపం వల్ల ఇమ్యూనిటీ పవర్ తగ్గుతుంది. ఇమ్యూనిటీ పవర్ తగ్గితే శరీరంలో అనేక రోగాలు వస్తాయి. మీకు పదే పదే రోగాలు వస్తే విటమిన్ సి లోపం వల్ల ఇలా జరిగిందని అర్థం.

**అలసట,బలహీనత,**

ఎటువంటి కారణంగా లేకుండా మీరు నిరంతరం అలసిపోయినట్టు అనిపిస్తే అది విటమిన్ సి లోపానికి సంకేతం కావచ్చు. మీరు ఎటువంటి పనిచేయకపోయినా, చిన్న చిన్న పనులు చేసినా అలసట వస్తే జాగ్రత్తపడటం అనివార్యం. విటమిన్ సి శరీరంలో తగినంత లేకపోతే బలహీనతగా అనిపిస్తుంది. శరీరంలో తగినంత శక్తి లేక ఇలా అనిపిస్తుంది. మీకు పదే పదే ఇలా జరుగుతుంటే వైద్యుణ్ని సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పెద్దవారిలో(19 ఏళ్లు పైబడిన) మగవారికి 90 ఎంజీ,ఆడవారికి 75 ఎంజీ ,గర్భిణీలకు 85 ఎంజీ, పాలిచ్చే తల్లులకు 120 ఎంజీ అవసరం.

చిగుళ్ళ వాపు, రక్తస్రావం, దంతాలు వదులుగా మారడం వంటివి విటమిన్ సి లోపం ముఖ్య లక్షణాలు. దంతాలు కూడా ఊడిపోవచ్చు. ఈ లక్షణాలు పదే పదే కనిపిస్తే ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయవద్దు. వెంటనే వైద్యుణ్ని సంప్రదించి తగిన వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

**గాయాలు అవ్వడం, మానకపోవడం**

విటమిన్ సి లోపం వల్ల రక్తనాళాలు బలహీనపడతాయి. రక్తనాళాలు బలహీనపడటం వల్ల చిన్నపాటి దెబ్బలకే సులభంగా గాయాలు అవుతాయి. చర్మంపై ఎర్రటి మచ్చలు (దద్దుర్లు) కనిపించవచ్చు. అంతేకాకుండా కొల్లాజెన్ ఉత్పత్తికి విటమిన్ సి అవసరం. ఇది గాయాలు మానడానికి సాయపడుతుంది. అదే విటమిన్ సి లోపం ఉన్నప్పుడు, గాయాలు నెమ్మదిగా మానతాయని నిపుణులు చెబుతున్నారు.

**పొడి జుట్టు, చర్మం**

కొల్లాజెన్ చర్మం, జుట్టు ఆరోగ్యానికి కూడా అవసరం. విటమిన్ సి లోపం వల్ల కొల్లాజెన్ సరిగ్గా ఉత్పత్తి అవ్వదు. విటమిన్ సి లోపం వల్ల జుట్టు రాలడం, పొడిబారడం, పెలుసుగా మారడం, చర్మం పొడిబారడం, ముడతలు వంటి అకాల వృద్ధాప్య లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణం కనిపిస్తే వెంటనే అలర్ట్ అవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

విటమిన్ సి మొక్కల ఆధారిత ఆహారాల నుంచి ఐరన్ల శోషణకు సాయపడుతుంది. అదే విటమిన్ సి... లోపం ఉన్నప్పుడు ఐరన్ శోషణ తగ్గి రక్తహీనత ఏర్పడవచ్చు. అంటే ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గడం లేదా ఉత్పత్తి సరిగ్గా లేకపోవడం. దీనివల్ల పాలిపోవడం, శ్వాస ఆడకపోవడం, మైకం వంటివి వస్తాయి. ఈ లక్షణాలు పదే పదే కనిపిస్తే వైద్యుణ్ని సంప్రదించి తగిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

విటమిన్ సి లోపం ఉన్నవారిలో అలసట, ఆకలి లేకపోవడం, చిరాకు వంటి లక్షణాలు కూడా కనిపించవచ్చు. హైపర్ థైరాయిడిజం వంటి సమస్యలకు కూడా విటమిన్ సి లోపం దారి తీయవచ్చు. దీనివల్ల అనుకోకుండా బరువు తగ్గడం, గుండె దడ వంటివి రావచ్చు. మృదులాస్థిలో కొల్లాజెన్ ఒక ప్రధాన భాగం. దీంతో విటమిన్ సి లోపం వల్ల కీళ్ల నొప్పులు, వాపు రావచ్చు.

విటమిన్ సి లోపాన్ని నివారించడానికి బెస్ట్ ఆప్షన్ విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను డైట్ లో చేర్చుకోవడమే. విటమిన్ సి ఎక్కువ మొత్తంలో ఉసిరిలో లభిస్తుంది. అలాగే సిట్రస్ పండ్లు అంటే నిమ్మ,నారింజ, గ్రేప్ ఫ్రూట్ వీటితో పాటు స్ట్రాబెర్రీలు, కివి, బెర్రీలు, క్యాప్సికం, బ్రకోలి, పాలకూర వంటి వాటిలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. తక్కువ ఖర్చుతో అధిక మొత్తంలో విటమిన్ సి జామలో లభిస్తుంది. అవసరమైతే వైద్యుని సలహా మేరకు విటమిన్ సి సప్లిమెంట్లను కూడా తీసుకోవచ్చు.


* సుధాకర్.ఏ.వి
* రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
* స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
* 9000674747




## ఊరి ఆత్మను ఆవిష్కరించిన

# "బందారం కథలు"




"బందారం కథలు" అనే కథా సంకలనాన్ని పరిశీలించినప్పుడు, ఇవి కేవలం కథలు కాదు ఒక ఊరి జీవన శైలిని, సంస్కృతిని, జానపద విశ్వాసాలను, మానవ సంబంధాల సున్నితత్వాన్ని ప్రతిబింబించే జీవన చిత్రాలుగా నాకు అనిపించాయి. ప్రతి కథ ఒక కోణంలో గ్రామీణ జీవితాన్ని చూపిస్తూ, పాఠకుడిని ఆ వాతావరణంలోకి తీసుకెళ్తుంది.

"మా వూరు తీరు" గ్రామ సంస్కృతికి ప్రతిబింబం. "మా వూరు తీరు" కథ,కేవలం ఒక గ్రామ వర్ణన మాత్రమే కాదు; అది ఒక సమాజపు సాంస్కృతిక చరిత్ర. బందారం అనే ఊరు ఇక్కడ భౌగోళిక స్థలం మాత్రమే కాదు, ఒక భావోద్వేగ ప్రపంచంగా మారుతుంది. "కట్టుపోతుల బందారం" వంటి పేర్ల వెనుక ఉన్న జానపద విశ్వాసాలు, 'కనికట్టు' వంటి మంత్రశక్తుల కథలు ఇవన్నీ ప్రజల ఊహాశక్తి, భయాలు, నమ్మకాల మేళవింపుగా కనిపిస్తాయి.

జంటగుండ్ల కథలో ఒక సాధారణ గొర్లకాపరి ధైర్యం, తెలివితో శత్రువులను ఎదుర్కొన్న విధానం, "సామాన్యుడే అసామాన్యుడవుతాడు" అనే భావనను బలంగా ప్రతిపాదిస్తుంది. ఎల్లయ్య పాత్ర ద్వారా భయం నుంచి ధైర్యానికి మార్పు చాలా సహజంగా చూపబడింది. మల్లయ్య కథలో జానపద విశ్వాసం, ఆధ్యాత్మికత, సాహసం కలిసి ఒక మిథిక్ స్థాయిని సృష్టించాయి. పులులు, పాములు వంటి ప్రతీకలు ప్రకృతిపై మనిషి ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తాయి. మొత్తం కథన శైలి ప్రాంతీయ భాషలో ఉండటం వల్ల సహజత్వం పెరిగింది; ఇది ఒక ఎథ్నోగ్రాఫిక్ నేరేషన్‌లా అనిపిస్తుంది.

**"చెద్ద గడియ" – మానవ సంబంధాల లోతైన విశ్లేషణ**

"చెద్ద గడియ" కథలో జయమ్మ పాత్ర ద్వారా గ్రామీణ మహిళా జీవితం, ఆమె మానవీయ విలువలు ఎంతో హృదయానికి హత్తుకునేలా చూపబడ్డాయి. ఆమె జీవితం సేవాభావం, వినయం, కర్తవ్యనిబద్ధతతో నిండి ఉంటుంది.


కథలో ప్రధానంగా రెండు విభాగాలు కనిపిస్తాయి జయమ్మ జీవితం, ఆమె మరణం తర్వాత ఊరిలో జరిగిన పరిణామాలు. జయమ్మ చనిపోయిన తరువాత ఊరిలో మొదలైన అనుమానాలు, ముచ్చట్లు, దుష్ప్రచారాలు సమాజంలోని అసహజ స్వభావాన్ని బయటపెడతాయి.

పాపయ్యపై పడిన అన్యాయం, ఊరి మానసిక పరిస్థితి ఇవన్నీ కథను ఒక గాఢమైన సామాజిక వ్యాఖ్యగా నిలబెడతాయి.

రచయిత భావోద్వేగాలను చాలా సహజంగా, మృదువుగా చిత్రీకరించారు.

**"గడీవాసం" జీవితం, రాజకీయాలు, అనుబంధాల మేళవింపు**

"గడీవాసం" కథలో గడీ ఒక ప్రతీకగా నిలుస్తుంది. ఆ గడీ చుట్టూ తిరిగే జీవితం హనుమంతరావు, ఆశవ్వ, నారాయణరావు, కృష్ణారావు వంటి పాత్రల ద్వారా జీవంతంగా కనిపిస్తుంది.



రాజకీయ చర్చలు, ఇంద్రాగాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య వ్యత్యాసాలు ఇవి కేవలం రాజకీయ అంశాలు కాదు గ్రామీణ జీవితాన్ని ప్రభావితం చేసే వాస్తవాలు. హనుమంతరావు పాత్ర లో బాధ్యత, త్యాగం, ధైర్యం స్పష్టంగా కనిపిస్తాయి. భూమి పంపకం, కుటుంబ సంబంధాలు, అనుబంధాలు ఇవన్నీ కథలో సహజంగా మిళితమై పాఠకుని మనసును తాకుతాయి. ఈ కథ జీవితం అనే సంక్లిష్ట వ్యవస్థను చాలా సహజంగా, లోతుగా ప్రతిబింబిస్తుంది.

"గట్టి మనిషి" సాధారణ జీవనంలో భావోద్వేగాల సౌందర్యం "గట్టి మనిషి" కథలో ఒక చిన్న సంఘటన ద్వారా మానవ మనసు లోతులను చూపించారు. వేపచెట్టు కింద కూర్చొనిఏడుస్తున్న వ్యక్తి ఆ దృశ్యం కథకు భావోద్వేగ గాఢతను ఇస్తుంది. ముసలమ్మ, ఎల్లవ్వ, రత్నవ్వ వంటి పాత్రల ద్వారా గ్రామీణ జీవితం సహజంగా ప్రతిఫలిస్తుంది. చిన్న చిన్న సంభాషణలు, రోజువారీ పనులు ఇవన్నీ కథను నిజజీవితానికి దగ్గరగా తీసుకెళ్తాయి.

చివరికి రత్నవ్వ, సెంద్రయ్య జీవితం ఒక సాధారణ ఆనందాన్ని సూచిస్తూ, కథకు సున్నితమైన ముగింపును ఇస్తుంది.

"బందారం కథలు" మొత్తం మీద ఒక గ్రామ సంస్కృతి, జానపద విశ్వాసాలు, మానవ సంబంధాలు, వ్యక్తిత్వ వికాసం ఇవన్నింటినీ సమగ్రంగా ప్రతిబింబించే గొప్ప కథా సంకలనం.

ఇవి కేవలం కథలు కాదు. ఒక ఊరి ఆత్మను, మనుషభావోద్వేగాలను, జీవన సత్యాలను అక్షరాలుగా మలిచిన సాహిత్య రూపాలు. ప్రతి కథ పాఠకుడిని ఆలోచింపజేస్తూ, మనసును తాకేలా నిలుస్తుంది.

బూర్గు. గోపికృష్ణ
-7995892410

## ఖిలా వరంగల్: శిలల్లో నిలిచిన శౌర్యం...

# విధ్వంసంలో దాగిన పాఠం





ఖిలా వరంగల్ (వరంగల్ కోట) కేవలం ఒక పురాతన నిర్మాణం కాదు; అది తెలుగు నేలను ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన కాకతీయుల శౌర్యానికి, వారి అద్భుత ఇంజనీరింగ్ ప్రతిభకు, శిల్పకళా వైభవానికి, చివరికి ఎదురైన విషాదకర పతనానికి సజీవ సాక్ష్యం. చరిత్రను చదవాలంటే పుస్తకాలు అవసరం లేకుండా, రాళ్లే మాట్లాడే ప్రదేశం ఇదే.

హన్మకొండను రాజధానిగా కొనసాగించిన కాకతీయులు, విస్తరిస్తున్న సామ్రాజ్య అవసరాలు మరియు భద్రతా కారణాల దృష్ట్యా మరింత పటిష్టమైన కేంద్రాన్ని కోరుకున్నారు. ఆ ఆలోచన ఫలితమే వరంగల్ కోట. క్రీ.శ. 12వ శతాబ్దం చివరలో రుద్రదేవుడు ప్రారంభించిన ఈ నిర్మాణం, గణపతిదేవుడు, రాణి రుద్రమదేవి, ప్రతాపరుద్రుల కాలంలో పరాకాష్టకు చేరింది. వారి పాలనలో వరంగల్ కేవలం రాజధాని కాదు—కళ, సంస్కృతి, వాణిజ్యం, సైనిక శక్తుల సమ్మేళనంగా ఎదిగింది.

ఈ కోట నిర్మాణం చూస్తే కాకతీయుల వ్యూహాత్మక దృష్టి ఎంత లోతైనదో అర్థమవుతుంది. మూడు రక్షణ వలయాలతో కోటను నిర్మించడం వారి సైనిక మేధస్సుకు నిదర్శనం. దాదాపు 12 కిలోమీటర్ల పరిధిలో ఉన్న మట్టి కోట చుట్టూ లోతైన కందకం ఉండేది. శత్రువులు దగ్గరపడకుండా మొసళ్లను కూడా పెంచేవారని చరిత్ర చెబుతుంది. మట్టి గోడను దాటినా, లోపల భారీ నల్ల గ్రానైట్ రాళ్లతో నిర్మించిన రాతి కోట ఎదురవుతుంది. ఎలాంటి సిమెంట్ లేకుండా, రాళ్లను ఒక దానికొకటి గట్టిగా అమర్చిన ఈ నిర్మాణం, ఆ కాలంలోనే ఉన్నత స్థాయి ఇంజనీరింగ్‌ను చూపిస్తుంది. ఈ గోడలపై ఉన్న బురుజులు శత్రువుల కదలికలను పర్యవేక్షించేందుకు కీలకంగా ఉపయోగపడ్డాయి.

కోట మధ్యలోని శిల్పకళ మరో ప్రపంచాన్ని గుర్తుచేస్తుంది. నాలుగు దిక్కులా నిలిచిన కాకతీయ కళాతోరణాలు కేవలం ద్వారాలు కాదు—వాటి ప్రతి అంచులో కళ జీవిస్తుంది. హంసలు, పూల తీగలు, కీర్తిముఖాలు, ఏనుగుల ఆకృతులు—ప్రతి శిల్పం శిల్పుల ప్రతిభను ప్రతిబింబిస్తుంది. ఇవే నేడు తెలంగాణ అధికారిక చిహ్నంగా నిలిచాయి. స్వయంభూ శివాలయం, నంది విగ్రహాలు, నాట్యశిల్పాలు కాకతీయుల ఆధ్యాత్మికతను, కళాప్రియతను తెలియజేస్తాయి.


అయితే ఈ వైభవం ఎక్కువకాలం నిలవలేదు. ఢిల్లీ సుల్తానుల దండయాత్రలు కాకతీయ సామ్రాజ్యాన్ని కుదిపేశాయి. అల్లావుద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ కాఫూర్ దాడులు ప్రారంభమైతే, 1323లో ఉలుగ్ ఖాన్ ముట్టడితో కథ ముగిసింది. ఐదు నెలల పాటు సాగిన యుద్ధం, ఆహార కొరత, అంతర్గత బలహీనతల కారణంగా కోట శత్రువుల చేతికి చేరింది. అనంతరం దేవాలయాలు, రాజప్రసాదాలు విధ్వంసానికి గురయ్యాయి. వరంగల్ "సుల్తాన్‌పూర్"గా మారింది.

ఈ విధ్వంసం కేవలం రాజకీయమే కాదు—సాంస్కృతిక దాడి కూడా. ఒక సామ్రాజ్యాన్ని బలహీనపరచాలంటే, వారి సంస్కృతిని ధ్వంసం చేయాలనే ఉద్దేశంతో దేవాలయాలు కూల్చివేయబడ్డాయి. అందుకే నేడు మనకు పూర్తి నిర్మాణాలు కాకుండా, విరిగిన స్తంభాలు, నేలకొరిగిన శిల్పాలు మాత్రమే కనిపిస్తున్నాయి.

అయినప్పటికీ, నాలుగు కాకతీయ తోరణాలు మాత్రం కాలానికి తలవంచలేదు. అవి నేటికీ నిలబడి, ఒక మహాసామ్రాజ్య గాథను చెబుతున్నాయి. శిలాశాసనాలు, అమీర్ ఖుస్రో వంటి చరిత్రకారుల రచనలు ఈ కథను మరింత బలపరుస్తాయి.


ఖిలా వరంగల్ పర్యాటక స్థలం మాత్రమే కాదు—అది తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక. శౌర్యం, సృజనాత్మకత, వ్యూహం, విధ్వంసం—ఈ నాలుగింటినీ ఒకే చోట అనుభూతి చెందించే అరుదైన చారిత్రక స్థలం. శిథిలాల మధ్య నడుస్తూ చూస్తే, ఒకప్పుడు ఇక్కడ సామ్రాజ్యం ఊపిరి పీల్చిందని మనసే చెబుతుంది.

– దహగం శ్రీనివాస్,
సీనియర్ జర్నలిస్ట్



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 04.04.2026
www.mudranews.in | @mudranews



టాప్ 10 ల్యాప్‌టాప్‌లు :
HP స్పెక్టర్ x3602-in-1 ల్యాప్‌టాప్, టాబ్లెట్‌లా కూడా వాడొచ్చు

స్టైలిష్ లుక్ + మంచి పెర్ఫార్మెన్స్

# ప్రణాళికబద్ధంగా పాలమూరు అభివృద్ధి

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**




**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** పాలమూరు పట్టణాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండున్నర ఏళ్లలో చేసిన అభివృద్ధిని వివస్తూ. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో మహబూబ్‌నగర్ ను ఎడ్యుకేషన్ హబ్ గా అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఇంజనీరింగ్, డిగ్రీ, జూనియర్ కాలేజీలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, అడ్వాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్లు, ట్రిపుల్ ఐటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ఎన్నో విద్యాసంస్థలు పట్టణానికి తెస్తున్నామని అన్నారు. కొత్తగా వచ్చే విద్యా సంస్థల ద్వారా ఇతర జిల్లాల నుంచి విద్యార్థుల రాక పెరిగి, రెంటల్ హౌసింగ్, చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందుతూ స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోందన్నారు. తాగునీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, రోడ్లు,అర్బన్ ప్లానింగ్ రంగాలలో సమగ్ర ప్రణాళికలు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి అసెంబ్లీ లో బిల్లు పెట్టి పాస్ చేయించామని, దీని ద్వారా పట్టణంలో అభివృద్ధి జరగడమే కాకుండా ప్రాజెక్టులకు అవసరమైన నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.220 కోట్ల వ్యయంతో వాటర్ ఆగ్మెంటేషన్ స్కీమ్ లో భాగంగా 14 రిజర్వాయర్ల నిర్మాణం, 18.6 మిలియన్ లీటర్ల అదనపు నీటి నిల్వ సామర్థ్యం , 40 కిలోమీటర్ల ఫీడర్ పైప్‌లైన్లు , 209 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్ ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం శంకుస్థాపన చేసిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్ట్ పూర్తయితే దీర్ఘకాలిక పరిష్కారం లభిస్తుందన్నారు. పట్టణం చుట్టూ రింగ్ రోడ్ల నిర్మాణాలు, నేషనల్ హైవే కనెక్టివిటీ విస్తరణ, బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వేతో అనుసంధానం, ఎకనామిక్ కారిడార్‌లో భాగస్వామ్యం, ఇవి నగరాన్ని లాజిస్టిక్స్, ఇండస్ట్రియల్, ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దనున్నాయన్నారు. ఈ అభివృద్ధి పనులకు భూసేకరణ అవసరం ఉన్నందున ప్రజలు సహకరించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరైన పరిహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు ఎస్.శేఖర్, పెద్ద గొల్ల నర్సింహులు, రమేష్ రెడ్డి,కిషన్ నాయక్, విఠల్ రెడ్డి , యాదగిరి శాంతన్న యాదవ్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ కారిడార్ పేరు రాజకీయాలు తగదు

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**



**ముద్ర, కాప్రా:** ఉప్పల్ కారిడార్‌పై రాజకీయాలు తగదని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి హితవు పలికారు. శుక్రవారం కాప్రాలో మీడియాతో మాట్లాడుతూ ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన బండారి రాజిరెడ్డి. ఉప్పల్ నియోజకవర్గం మొదటి ఎమ్మెల్యేగా మున్సిపల్ చైర్మన్‌గా, టీటీడీ బోర్డు సభ్యుడిగా అన్ని పదవులలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అలాంటి వ్యక్తి సేవలకు గుర్తింపుగా ఎలివేటెడ్ కారిడార్‌కు ఆయన పేరు పెట్టడం గర్వకారణం అని స్పష్టం చేశారు. బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ కారిడార్‌కు వాజపేయి పేరు పెట్టాలని మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. జాతీయ నాయకుల పేర్లు జాతీయ రహదారులకు సరిపోతాయని అన్నారు. తమకు బీజేపీపై ద్వేషము లేదని, దేశానికి సేవ చేసిన వాజ్పేయి పట్ల అపారమైన గౌరవం ఉందని అంటూ, అలాంటి మహా నేత పేరు జాతీయ రహదారులకు పెట్టవచ్చన్నారు. స్థానిక అభివృద్ధికి కృషి చేసిన నాయకుల పేర్లను గుర్తించడం తప్పా? అంటూ ప్రశ్నించారు. అర్థం లేని వ్యాఖ్యలు చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాను. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఎవరు అభివృద్ధి కోసం పనిచేస్తున్నారో, ఎవరు రాజకీయ లాభాల కోసం మాట్లాడుతున్నారో వారికి బాగా తెలుసు అన్నారు. నేనెప్పుడూ అక్రమాలకు పాల్పడలేదు తనలాగా పార్కులు కబ్జాకు ప్రోత్సహించలేదంటూ ప్రభాకర్ పై ఘాటుగా విమర్శలు చేశారు.

## 'స్టడీ వైల్ ప్లేయింగ్ రూపకర్త బసవోజుకు అవార్డు



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** విద్యారంగంలో వినూత్న ఆవిష్కరణలు చేస్తున్న 'స్టడీ వైల్ ప్లేయింగ్ గేమ్స్' రూపకర్త బసవోజు దేవేంద్రాచారికి ప్రతిష్టాత్మకమైన ప్రగతి నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు–2026 ప్రదానం చేశారు. హైదరాబాద్ లోని బిర్లా మ్యూజియంలోని భాస్కర ఆడిటోరియంలో ఈ అవార్డు ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన ప్రతిభావంతులకు ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ డా. ఆరిఫ్, దూమ్ డాన్స్ స్టూడియో చైర్మన్ ఆజిమ్ సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి పద్మశ్రీ గ్రహీత కిన్నెర మొగలయ్య హాజరవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే రాష్ట్రపతి అవార్డు గ్రహీత సాజిదా ఖాన్, ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ సత్యకౌశ్యాప్, సొల్జర్స్ అకాడమీకి చెందిన చౌహాన్ కృష్ణ పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ముంబై ప్రాంతాల నుంచి అవార్డు గ్రహీతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ డాన్స్ అకాడమీల విద్యార్థులు అద్భుత నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విద్యా రంగంలో సృజనాత్మకతను ప్రోత్సహించేలా ఈ అవార్డులు ప్రేరణగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**ముద్ర, మల్కాజిగిరి:** మెరుగైన వైద్య సేవలు పొందేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ను అర్హులైన వారు సద్వినియోగపరచుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. 9 మందికి రూ. 3,72,000 విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, డోలి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## హిందువు అనే పదానికి అర్థం క్రమశిక్షణ

**అంబాత్రయ క్షేత్రం వ్యవస్థాపకులు ఆది పరాశ్రీ స్వామీజీ**




**ముద్ర, నారాయణ పేట:** స్వచ్ఛమైన హిందూ ధర్మం పాటిస్తే ఆసుపత్రులకు వెళ్లాల్సిన పనిలేదనీ సనాతన హిందూ ఆహారపు అలవాట్లు అందరూ తిరిగి పాటించాలని అంబాత్రయ క్షేత్రం వ్యవస్థాపకులు ఆది పరాశ్రీ స్వామిజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శ్రీరామ బస్తీ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమంలో మాట్లాడారు. హిందువు అంటేనే క్రమశిక్షణకు అర్థం అన్నారు. హిందూ ధర్మ పద్ధతులను ప్రతీ ఒక్కరు తమ పిల్లలకు నేర్పించాలన్నారు. అంతకు ముందుగా శ్రీరాముని చిత్రపటానికి పూజలు చేసి యజ్ఞ కార్యక్రమంతో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు, కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కొండా శ్వేతా సత్యాయాదవ్, కౌన్సిలర్లు సత్య రఘుపాల్, కాకర్ల నారాయణమ్మ, సౌజన్య, మహేష్, భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి, మ్యాడమ్ ప్రభాకర్, శ్రీరామ బస్తి హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు గుంపు బాలరాజ్, పత్తికొండ రాములు, అమ్మపల్లి శిరీష, ఆయా బస్తీల నుంచి పెద్ద ఎత్తున హిందూ సమ్మేళన సమితి సభ్యులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**ముద్ర, గద్వాల:** గద్వాల మండలం గోనుపాడు గ్రామపంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ జి. రాములమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్డే పరుషరాముడు సహకారంతో మజ్జిగను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చాంద్ సాలేహా, ఉప సర్పంచ్ సత్యమ్మ, మండల నాయకులు శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ముద్ర, గద్వాల:** ఎలాంటి అనుమతులు లేకుండా గట్టు మండలం బల్గెర నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను శుక్రవారం కేటిదొడ్డి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. చింతలకుంటకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న క్రమంలో పోలీసులు ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకుని, ట్రాక్టర్ డ్రైవర్ హన్మంతు, మరియు ఓనర్ రమేష్ ల పై కేసు నమోదు చేశారు.

## 8న తెలంగాణ జాగృతిలో చేరికలు

**నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్**

**ముద్ర, గద్వాల:** ఏప్రిల్ 8న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీలో చేరుతున్నట్లు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం గద్వాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నడిగడ్డ హక్కుల పోరాట సమితి వేదికగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, ప్రజా శ్రేయస్సుకై ప్రశ్నించే గొంతుకగా ప్రజల తరఫున సమస్యలపై గళం విప్పుతున్నామని తెలిపారు. నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు తెలంగాణ సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న తెలంగాణ జాగృతిలో భాగస్వాములై పోరాటం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా కార్యదర్శి లవన్న, జిల్లా నాయకులు వెంకట్రాములు, రంగస్వామి, ధరూర్, మల్దకల్, గట్టు మండలాల అధ్యక్షులు నెట్టెంపాడు గోవిందు, విష్ణు, బలరాం నాయుడు, మండల ఉపాధ్యక్షులు ప్రేమ్ రాజ్, మునెప్ప, మల్దకల్, అడివి ఆంజనేయులు, నజుముల్లా, మండల కార్యదర్శులు రాము, దయాకర్, ఉప్పరి కృష్ణ, మండల ముఖ్య నాయకులు గోపాల్, లక్ష్మన్న, దొడ్డన్న, విజయ్, వెంకటేష్, కేపీ రామక్రిష్ణ, చిన్న రాముడు, సర్వేశ్, భూపతి నాయుడు, సామెల్, స్వామి, ఆశన్న, నరసింహ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య వీరత్వం మరువలేనిది



**-అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమరయ్య వీరత్వం మరువలేనిదని జిల్లా అదనపు కలెక్టర్ మా శంకర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు బి సి వెల్ఫేర్ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆయనకు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి వీరమరణం పొందిన యోధుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని, ఆయన ధైర్యం, త్యాగం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం మనకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. రాజకీయ, సామాజిక రంగాలలో అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన కొమురయ్య ఆశయాలు నేటికీ ప్రసంగించుకుంటున్నామని, రైతుల హక్కులు, పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన త్యాగం ఎప్పటికీ మరువలేనిదన్నారు.ఈ సందర్భంలో యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందుతూ సమాజంలో న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో బీసీ వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం యశోద నగర్ పార్క్ నందు దొడ్డి కొమురయ్య 99 జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాండూరు పురపాలక సంఘం చైర్మన్ శ్రీమతి శ్రీ పట్లోళ్ల నీరజబాల్ రెడ్డి దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం అణగారిన ప్రజల హక్కుల కోసం అగ్ని జ్వాలగా నిలబడి పోరాడిన వీరుడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి తొలి అమరుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు శ్రీ దొడ్డి కొమురయ్య అని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన తాండూర్ టౌన్ కురువ సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు మాట్లాడుతూ. ఆయన త్యాగం, ధైర్యం, పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకం కావాలి అని అన్నారు.

**ముద్ర, కాప్రా:** మల్లాపూర్ డివిజన్‌లో నిర్వహించిన దొడ్డి కొమరయ్య జయంతి ఉత్సవాలలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు అయిన దొడ్డి కొమరయ్య ఆశయాలు సమాజానికి ఎంతో ప్రేరణ అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతర భద్రత ఏర్పాట్లపై డీఐజీ సమీక్ష



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** సలేశ్వరం జాతర సందర్భంగా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్ శుక్రవారం పరిశీలించారు. ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి జాతర ప్రాంగణాన్ని సందర్శించి, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. జాతరలో చేపట్టిన భద్రతా చర్యలపై డీఐజీ సంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది అంకితభావంతో పని చేస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో సుమారు 400 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే అనవసరంగా లోతైన అటవీ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని హెచ్చరించారు.ఈ సందర్భంగా సమర్థవంతమైన బందోబస్తు ఏర్పాట్లు చేసిన ఎస్పీని అభినందించారు. ఇక గురువారం రాత్రి జరిగిన ఘటనలో నాగర్ కర్నూల్ ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ బాబుమియా ప్రమాదవశాత్తు లోయలో పడిపోవడంతో, అక్కడే విధుల్లో ఉన్న ఎస్సై మురళి, కానిస్టేబుల్స్ ఊర్మిళ, మణిక వెంటనే స్పందించి అతన్ని క్షేమంగా పైకి తీసుకువచ్చారు. అనంతరం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వీరి ధైర్యసాహసాలకు మెచ్చి డీఐజీ అభినందించారు.

## పదోన్నతి పొందిన సిబ్బందికి క్యాపింగ్ సెర్మనీ



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న హెడ్ నర్సులకు పదోన్నతులు కల్పించిన నేపథ్యంలో, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్లుగా పదోన్నతి పొందిన వారికి శుక్రవారం క్యాపింగ్ సెర్మని నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి నుండి సలెహా రహీం, సరోజినీ దేవి కంటి ఆసుపత్రి నుండి నాగవేణి డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్లుగా పదోన్నతి పొందిన సందర్భంగా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఈ కార్యక్రమాన్ని నర్సింగ్ సూపరింటెండెంట్లు మంజుల, పేర్సి సుమన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన నర్సులను శాలువలు కప్పి, పూలమాలతో సత్కరించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుల మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న నర్సింగ్ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించడం శుభపరిణామమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెడ్ నర్సులు పద్మ, సునీత, శ్వేతతో పాటు నర్సింగ్ ఆఫీసర్లు ఎం. ఆనంద్, సరస్వతి, అనురాధ, పుష్పలత, కవిత, జ్యోతి, నిర్మల, నీలిమ, స్వప్న, అరుణ, రమా పాల్గొన్నారు.

## 76 మంది విద్యాశాఖ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్.ఆర్.ఎస్(ఫేస్ రికగ్నైజ్ సిస్టం) హాజరు విధానం సక్రమంగా నిర్వహించకపోవడం వలన 76 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ హాజరు నమోదును పరిశీలించగా, పలుచోట్ల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఈ యాప్‌లో హాజరు సక్రమంగా నమోదు చేయకపోవడం గమనించారు. దీంతో జిల్లా పరిధిలోని 61 పాఠశాలలకు చెందిన 76 మంది బోధన, బోధనేతర సిబ్బందిపై చర్యలు తీసుకుంటూ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. సంబంధిత సిబ్బంది తమ సంజాయిషీని మూడు రోజుల లోపు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రతి రోజూ ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరును తప్పనిసరిగా సమయానికి నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నాగర్ కర్నూల్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జక్క రాజ్ కుమార్ రెడ్డి నియామకం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జక్క రాజ్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ, తనపై ఉంచిన నమ్మకం, బాధ్య తను గౌరవంగా స్వీకరిస్తున్నట్లు తెలిపారు.ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞత లు తెలిపారు. అలాగే జిల్లా డీసీసీ అధ్యక్షులు వంశీకృష్ణ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు సంపూర్ణ నిబద్ధతతో కృషి చేస్తానని జక్క రాజ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ వాసి విజయం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓరుగంటి క్రాంతి కుమార్ నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సభ్యునిగా ఘన విజయం సాధించారు. ఇటీవల జరిగిన ఈ ఎన్నికల్లో ఆయన భారీ మెజారిటీతో గెలుపొందడం విశేషం. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ విజయంపై నాగర్ కర్నూల్ ప్రాంతంలో ఆనందం వెల్లివిరిసింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆయనను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఉన్నత స్థాయికి చేరుకోవడం గర్వకారణమని స్థానికులు కొనియాడారు. క్రాంతి కుమార్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## నూతన ఎంఈవోకు సన్మానం

**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ మండల విద్యాధికారిణి ఇందుప్రియకు తాం డూర్ మండల పీఆర్‌టీయూ నాయకులు శాలువాతో సన్మా నించి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల పదవీ విరమణ చేసిన మండల విద్యాధికారి వెంకటాయ గౌడ్ స్థానంలో నూతన విద్యాధికారిణిగా ఇందుప్రియ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో తాండూరు మండల పి ఆర్ టి యు నేతలు నారాయణ గౌడ్, ఖద్దూస్, అబ్దుల్ రెహమాన్, మమ్మద్ అమీర్ తదితరులు ఎంఈఓ ను కలిసిన వారిలో ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 04.04.2026
www.mudranews.in | @mudranews

6 ఉత్తర తెలంగాణ
కరీంనగర్, ఆదిలాబాద్
Karimnagar, Adilabad

టాప్ 10 ల్యాప్ టాప్ లు

లెనోవా థింక్‌ప్యాడ్ X1 కార్బన్
బిజినెస్ యూజర్లకు నంబర్ 1 ఎంపిక కీబోర్డ్, బిల్డ్ క్వాలిటీ చాలా స్ట్రాంగ్



# వారం రోజుల్లో నిర్ణయం..

**- పార్టీ మార్పుపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి వ్యాఖ్యలు**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** పార్టీ మార్పుపై వారం రోజుల్లో తన నిర్ణయం ప్రకటిస్తానని మాజీ మంత్రి జీవన్ రెడ్డి వెల్లడించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండేళ్లలో రేవంత్ రెడ్డి సర్కారు పోవాలని, ఆయనను ఓడించే సత్తా ఉన్న పార్టీలోనే చేరుతానని స్పష్టం చేశారు. గతంలో కేసీఆర్ ఓడి పోవాలని ప్రజలు కోరుకున్నారని, అదే విధంగా ఇప్పుడు మళ్లీ మార్పు రావాలని ప్రజల్లో భావన పెరుగుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మార్పు అవసరం ఉందని భావిస్తున్నానని చెప్పారు. ఆ మార్పు తీసుకురాగల శక్తి ఉన్న పార్టీలో చేరడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. కేవలం పదవుల కోసం కాకుండా, రాజకీయంగా ప్రభావం చూపగల వేదికనే ఎంచుకుంటానని పేర్కొన్నారు. వారం రోజుల్లో తుది నిర్ణయం ప్రకటిస్తానని తెలిపారు. తన అభిమానులు, అనుచరుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుం టానని చెప్పారు.

## రేవంత్ రెడ్డిది నిర్లక్ష్య పాలన..

ప్రాణహిత నది జలాలను వినియోగించుకోకవడం, కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరించకపోవడం సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్య పాలనకు నిదర్శనమని జీవన్ రెడ్డి ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కాళేశ్వరం ప్రాజెక్ట్ లక్ష కోట్లు కొట్టుకుపోయిందనడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్ లు ఒక భాగం మాత్రమే అని అన్నారు. మూడు బ్యారేజ్ లు పునరుద్ధరించాలంటే రూ.500 కోట్లు మాత్రమే అయ్యే అవకాశం ఉందన్నారు. కాళేశ్వరం ఫిల్లర్లు కుంగిపోయి రెండేళ్లు గడిచి పోయాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఉత్తర తెలంగాణకే కాదని, యావత్ రాష్ట్రానికి ఆధారమని స్పష్టం చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో తుమ్మడి హెట్టి బ్యారేజ్ తవ్విన కాలువలను రీ డిజైన్ చేయాలని కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో కూడా చేర్చిందని, ప్రస్తుతం పట్టించుకోవడం లేదన్నారు. యావత్ తెలంగాణకు ఆధారమైన ప్రాణహిత నది జలాలను వినియోగించుకునేందుకు కనీసం డిజైన్ కూడా రూపొందించ లేదన్నారు. నాయకులు జున్ను రాజేందర్, పుప్పాల అశోక్, శీలం సురేందర్, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# మత్తుపదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** యువత గంజాయి వంటి మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డా.జి.జానకి షర్మిల సూచించారు. ఈ మేరకు శుక్రవారంగంజాయి వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గాంజాగస్తీవి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌హెచ్‌ఓలు, పోలీస్ సిబ్బంది కిరాణా దుకాణాలు, పాన్ దుకాణాలు, అనుమానాస్పద ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ప్రజలకు గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు, యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని వివరించారు. మత్తు పదార్థాల విక్రయం, వినియోగంపై సమాచారం తెలిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

# ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** కలెక్టరేట్ లో శుక్రవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో రత్న కళ్యాణి పలువురు అధికారులు, కుల సంఘాల నాయకులతో కలిసిదొడ్డి కొమ రయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, జిల్లా కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో మంత్రి జూపల్లి భోజనం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో కలిసి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు భోజనం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన నిమిత్తం బాసర వచ్చిన జూపల్లి శుక్రవారం రాత్రి బాసర ట్రిపుల్ ఐటీ లో బస చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ డా.జి.జానకి షర్మిల, వైస్ ఛాన్సలర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# కుంభమేళా తరహాలో పుష్కరాలు..

**- మంత్రి జూపల్లి కృష్ణారావు**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** బాసరలో గోదావరి పుష్కరాలను కుంభ మేళా తరహాలో నిర్వహిస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 6న బాసర పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకటస్వామి లు కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి పరిశీలించారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు మంత్రులకు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం కలెక్టర్ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టబోయే ప్రాంతాల వివరాలను మంత్రులకు వివరించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్న ప్రదేశాలను మంత్రులు పరిశీలించి, అధికారులకు కీలక సూచనలు చేశారు. రాజన్న అతిథి గృహంలో నిర్వ హించిన సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, వెడ్మా బొజ్జు పటేల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎస్పీలు సాయి కిరణ్, ఉపేంద్ర రెడ్డి, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, ఆలయ ఈవో విజయ రామారావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య ఆదర్శప్రాయుడు



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ నేటి యువతకు ఆదర్శప్రాయుడని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని ధర్మపురి రోడ్డు విజయపురిలో గల దొడ్డి కొమురయ్య విగ్రహానికి శుక్రవారం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ లో నిర్వహించిన కూడా జయంతి ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ భగత్ సింగ్ దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితోనే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, ఏఎంసీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, కమిషనర్ స్పందన, కౌన్సిలర్ లు, నాయకులు బాల ముకుందం, దయాళ మల్లారెడ్డి, పుల్ల మల్లయ్య, కురుమ సంఘం సభ్యులు, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల సమీపంలో కొండచిలువ



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పట్టణంలోని వాసవి ఉన్నత పాఠశాల సమీపంలో శుక్రవారం పొడవైన కొండ చిలువ కనిపించింది. దీంతో ఉపాధ్యాయులు పట్టణానికి చెందిన పాములు పట్టే షేక్ యాసిన్ కు ఫోన్ చేశారు. ఆయన వెంటనే వచ్చి కొండచిలువను పట్టుకొని దూర ప్రాంతంలో వదిలేశాడు. దీంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదని ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

# క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రజా ప్రభుత్వం

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ప్రజా ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. జగిత్యాల ధరూర్ క్యాంప్ రామాలయం కల్యాణ మండపంలో గురువారం జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల పట్ల శ్రద్ధ చూపిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని పేర్కొన్నారు. తల్లి తండ్రులతోపాటు స్వచ్ఛంద సంస్థలు సైతం క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. క్రీడలతో మానసిక స్థైర్యం పెంపందడమే కాకుండా, చదువు పట్ల మరింత శ్రద్ధ ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు చారి, మంచాల కృష్ణ, టీవీ సూర్యం, సిరిసిల్ల శ్రీనివాస్, కోచ్ రామాంజనేయులు, సంతోష్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ పై దాడి

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** తనకు సైడ్ ఇవ్వలేదని కోపంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ పై ఆటో డ్రైవర్ దాడి చేసిన సంఘటన శుక్రవారం జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టౌన్ ఎస్సై సుప్రియ తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసీ డ్రైవర్ మహమ్మద్ జలీల్ వరంగల్ డిపో నుంచి నిజామాబాద్ కు బస్సును తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యంలో జగిత్యాల పట్టణంలోకి రాగానే ఆటో డ్రైవర్ ముసుకు ప్రదీప్ వెనుక వైపు నుంచి హారన్ కొట్టాడు. అయితే తన ఆటోకు సైడ్ ఇవ్వలేదని కొత్త బస్టాండ్ ప్రాంగణంలోకి వచ్చి బస్సు డ్రైవర్ పై దుర్భాషలాడుతూ కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుప్రియ పేర్కొన్నారు.

# మొక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**కోరుట్ల, ముద్ర:** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల పరిధిలో మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ప్రభుత్వ విప్ కథలాపూర్ లో పర్యటించారు. మొక్కలకు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు విప్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే మంత్రికి ఫోన్ చేశారు. మంత్రి సాను కూలంగా స్పందించినట్లు రైతులు తెలిపారు.

# రిటైర్డు ఆర్మీ జవాన్ కు సన్మానం



**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌట–బిలో శుక్రవారం రిటైర్డు ఆర్మీ జవాన్ ను ఘనం గా సన్మానించారు. గ్రామానికి చెందిన ఓరుగంటి సురేష్ పదిహేడేళ్లు సైన్యంలో సేవ చేసి పదవి విరమణ పొందాడు. ఆయన తన విధి నిర్వహణలో భాగంగా జమ్మూ కాశ్మీర్, బెంగుళూరు, సిక్కిం లతో పాటు ఐక్యరాజ్యసమితి తరుపున కాంగో దేశంలో సైతం సేవలందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ దేశానికి సేవే చేసే అవకాశం తనకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. పుట్టిన ఊరుకు, గ్రామస్తులకు తాను ఎల్లప్పుడూ ఋణపడి ఉంటానని పేర్కొన్నారు. యువత అధిక సంఖ్యలో దేశ సేవ కు సన్నద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓరుగంటి స్వామి, ఉప సర్పంచ్ ఇట్టేడి రమణ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు పిడుగు అశోక్ రెడ్డి, వీడీసీ మాజీ అధ్యక్షుడు బి. శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు వినాయక్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు

# సీఎం సభను విజయవంతం చేద్దాం

**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని బజార్ హత్నూర్ మండలం పిప్పిరిలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా ఈ నెల 6న నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావు పిలుపునిచ్చారు. పిప్పిరి లో జరగనున్న సీఎం సభ స్థలిని శుక్రవారం ఆయన మరో మంత్రి గడ్డం వివేక్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటానని చెప్పారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ ను ఆదర్శ జిల్లాగా మార్చే విధంగా కృషి చేస్తున్నారనన్నారు. పిప్పిరి సభలో బోథ్ నియోజకవర్గానికి సంబంధించిన పిప్రి, బుగ్గారం, తేజాపూర్, సుంకిడి లిఫ్ట్ ఇరిగేషన్ లు, బోథ్ నియోజకవర్గం లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, పొచ్చేరలో ఐటీఐ కళాశాల ఏర్పాటు ప్రకటనను చేయనున్నారని తెలిపారు.

టాప్ 10 ల్యాప్‌టాప్‌లు

ASUS ROG జెఫైరస్ G14 గేమింగ్ కోసం పవర్‌ఫుల్ ల్యాప్‌టాప్ AMD ప్రాసెసర్ + గ్రాఫిక్స్ మంచి పనితీరు ఇస్తాయి.




# మున్సిపాలిటీలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ ఎ. భాస్కర్ రావు



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్ రావు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఛాంబర్లో మున్సిపల్ కమిషనర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలలో జరుగుచున్న పలు అభివృద్ధి పనులు యుఐడిఎఫ్, టీయుఎఫ్ఐడిసి, అమృత స్కీం, స్వచ్ఛ భారత్, స్టాంప్ డ్యూటీ పనులు, చేపట్టబోతున్న పనుల పురోగతిపై సమీక్షిస్తూ పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయుటకు సంబంధిత కాంట్రాక్టర్స్ తో సమావేశం ఏర్పాటు చేసుకొని వారికి తగిన సూచనలు ఆదేశాలు ఇవ్వాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా ఏ మున్సిపాలిటీలో కూడా నీటి ఎద్దడి ఉండకూడదని అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాల్సిందిగా సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులను ప్రతిరోజు చెత్తకుప్పలు లేకుండా చూసుకోవాల్సిందిగా తెలిపారు. 5% రిబేట్ విషయమై ప్రజలకు అవగాహన కల్పించి ఆస్తిపన్ను వసూళ్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ డీఇఇ, ఏఇ లు, సిబ్బంది, పాల్గొన్నారు.

# 'దొడ్డి కొమురయ్యను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి'



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

నిజాం నిరంకుశ రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మొట్టమొదటిగా అమరుడైన దొడ్డి కొమురయ్యను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తాజ్ పూర్ కురుమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య జయంతి పురస్కరించుకొని మండలంలోని తాజ్ పూర్ లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయన స్ఫూర్తితోనే కమ్యూనిస్టు పార్టీ 3000 గ్రామాలను విముక్తి చేసి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద కుర్మ దేవునూరి బాలయ్య, షెల్ఫోజీ సోమన, బాలయ్య, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, షేక్ గాలిబీ యాకుబ్, బొమ్మారపు రామక్రిష్ణ, బొమ్మారపు లక్ష్మి బాల్ రాజ్, బీట్కూరి మహేష్, వరిగంటి మానస, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలపై కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి

● ఏఐఏడబ్ల్యూయూ ఆల్ ఇండియా కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్




ముద్ర ప్రతినిధి, భువనగిరి:

భూమి లేని వ్యవసాయ కూలీలకు 12 వేలు, మహిళలకు నెలకు 2500ల కోసం, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఎమ్మెల్యేలను, మంత్రులను, కాంగ్రెస్ నాయకులను గ్రామ గ్రామాన ప్రజలు నిలదీయాలని అఖిల భారతీయ వ్యవసాయ కార్మిక సంఘం ఆల్ ఇండియా కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్క్ షాప్ జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసి కేరళ రాష్ట్రంలో కూడా ప్రజలను కాంగ్రెస్ తరపున మోసం చేయడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రికి రాష్ట్రంలో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి జహంగీర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు నేటికీ పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వలేదని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, రాష్ట్ర కమిటీ సభ్యుడు జెల్లల పెంటయ్య, గంగాదేవి సైదులు, రాచ కొండ రాములమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల అంజయ్య, జూకంటి పౌల్, జిల్లా సహాయ కార్యదర్శులు సిరిపంగి స్వామి, గుంటోజి శ్రీనివాస్ చారి, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, బొడ్డు కిషన్, కొండపురం యాదగిరి, మానే సాలయ్య, బొల్లెపల్లి కిషన్, పద్మ, బాలరాజు, ముకుంద, హనుమంతు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రశిక్షణ అభియాన్ సమావేశాలను విజయవంతం చేయండి'



ముద్ర, మోత్కూరు:

మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం, ఆదివారం జరిగే ప్రశిక్షణ సమావేశాలను విజయవంతం చేయాలని బీజేపీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రశిక్షణ కన్వీనర వంగవీటి శ్రీనివాస రావు కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి బీజేపీ కార్యకర్తలకు పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణ, బూతు స్థాయి నిర్మాణం, పార్టీ బలోపేతం కావడానికి అనుసరించవలసిన వ్యూహాత్మక ప్రణాళికలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం తదితర విషయాలపై ఈ ప్రశిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ సమావేశాలకు మోత్కూర్ టౌన్, మోత్కూరు రూరల్, అడ్డగూడూర్ మండల కార్యకర్తలు నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల, కొనతం నాగార్జున రెడ్డి, గౌరు శ్రీనివాస్, కూరాకుల వెంకన్న, పోచం సోమయ్య, పట్టణ నాయకులు చేకూరి మల్లేశం, కందుకూరి ప్రకాష్, ముత్తినేని తిరుమలేష్, యేషబోయిన రమణ, బద్ద మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# సూర్యాపేట పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ



ముద్ర, సూర్యాపేట:

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎస్పీ నరసింహ శుక్రవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు, పోలీస్ స్టేషన్ పరిసరాలు పోలీస్ స్టేషన్లో నిర్వహిస్తున్న రికార్డ్స్, ఫిర్యాదుల నిర్వహణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నందు నిర్వహిస్తున్న కమాండెంట్ కంట్రోల్స్ సెంటర్ ను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధం పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని, రికార్డు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి భరోసా కల్పించాలని సూచించారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్పీ వెంట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐలు ఏడుకొండలు, ఐలయ్య, మహేందర్ నాథ్, శివతేజ, సిబ్బంది ఉన్నారు.

## దొడ్డి కొమురయ్యకు అధికారుల నివాళి

ముద్ర, సూర్యాపేట:

దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, నాయకులు ఆయనకు నివాళులు అర్పించారు. దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడిగా గుర్తింపు పొందిన ఆయన త్యాగం, ధైర్యం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రైతుల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డిటిడిఓ శంకర్ వివిధ సంఘాల నాయకులు జి.సత్యనారాయణ, డాక్టర్ రామ్మూర్తి, చిన్న శ్రీరాములు, వి.సత్యనారాయణ, హుస్సేన్, రాజయ్య, లింగయ్య, పి.గామయ్య తదితర నాయకులు పాల్గొన్నారు సంబంధిత అధికారులు, తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు మజ్జిగ పంపిణీ ప్రారంభం

ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం:

వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో సింగరేణి కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ కూల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో ఎస్.ఈ (ఈ & ఎం) అజ్మీర శ్రీనివాస్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అజ్మీర శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ నుండి రక్షణ పొందేందుకు కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో శరీరంలో నీటి శాతం తగ్గకుండా తరచుగా ద్రవాలు తీసుకోవాలని సూచించారు.


# యాదాద్రిలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని శుక్రవారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మొదటగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

## శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోశుక్రవారం సాయంత్రం శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుండి శ్రీ వేంకటేశ్వర స్వామికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారు బావి నుండి తీసుకు వచ్చారు. స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేద మంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.

## యువకుడి గొంతు కోసి హత్యాయత్నం

ముద్ర, ఖమ్మం:

ఖమ్మం రూరల్ మండలంలోని గొళ్లపాడు గ్రామలో యువకుడి గొంతు కోసి వ్యక్తి హత్యాయత్నం చేశాడు. గ్రామానికి చెందిన ముక్కా మునేష్ తన భార్యపై అనుమానంతో గత కొంతకాలంగా శివ అనే యువకుడిపై కోపం పెంచుకున్నాడు. గురువారం ట్రాక్టర్ కిరాయికి వీరిద్దరు వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో ఆరెకోడు క్రాస్ రోడ్ సమీపంలో మునేష్, శివను అడ్డగించి కత్తితో గొంతు కోశాడు. ఈ దాడిలో శివ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని సమీప ఆసుపత్రికి తరలించారు. నిందితుడు ముక్క మునేష్ పరారీలో ఉన్నాడు.

# సైబర్ నేరాలపై అవగాహన



ముద్ర, మోత్కూర్:

మోత్కూర్ మండలంలోని దత్తప్ప గూడెంలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఎండాకాలం కావడంతో గ్రామాల్లో దొంగతనాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని, గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల గురించి ఎప్పటికపకప్పుడు అవగాహన పెంచుకోవాలని, సైబర్ నేరాలు జరిగే తీరును గ్రామస్తులకు వివరించారు.

# ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ



ముద్ర, యాదగిరిగుట్ట:

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఉదయం అభిషేకం, సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉంజల్ సేవను ఆలయ వీధులలో ఊరేగించి భక్తులకు కనువిందు చేశారు. అనంతరం భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారి ఆలయంలో శుక్రవారం రూ.23 లక్షల 99 వేల 920 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, పవన్ కుమార్ శర్మ, శ్రీనాథ్ చార్యులు, కాందూరి వెంకటాచార్యులు, నరేష్ కుమార్ చార్యులు, అనిల్ కుమార్ చార్యులు, వినయ్ కుమార్ చార్యులు, సూపర్డెంట్ సురేందర్ రెడ్డి, ఇన్చార్జి వెంకటేష్, కొమ్మగాని కుమార్, ఎస్పీఎఫ్ సిబ్బంది నందు నాయక్, కురుమూర్తి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

ముద్ర, ఖమ్మం:

వైరా మండల పరిధిలోని ఇమామ్ నగర్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇల్లును వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదవారికి న్యాయం జరగలేదని, రేషన్ కార్డు ఇవ్వకుండా కాలం గడుపుతూ ప్రజలను మభ్య పెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే పేదల పార్టీ అని అన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
04.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews

8 పశ్చిమ తెలంగాణ
మెదక్, నిజామాబాద్
Medak, Nizamabad

టాప్ 10 ల్యాప్‌టాప్‌లు : ఏసర్ స్విఫ్ట్ 5

చాలా లైట్ వెయిట్, ట్రావెల్‌కి బెస్ట్. మంచి బ్యాటరీ మరియు వేగమైన పనితీరు








## సబ్బుబిళ్లపై శివాజీ చిత్రం.. వినూత్న నివాళి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

భారత మాత ముద్దుబిడ్డ, ధైర్యం, దేశభక్తి, దైవభక్తి, ధీరత్వానికి మారుపేరు అయిన ఛత్రపతి శివాజీ వర్ధంతి సందర్భంగా సబ్బుబిళ్లపై శివాజీ చిత్రాన్ని వేసి గజ్వేల్‌కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాజీ పేరు చెప్పగానే ప్రతి హిందువు రక్తం ఉరకలేస్తుందని అన్నారు. వీరుడు, శూరుడు, హిందువుల పాలిట దేవుడైన ఛత్రపతి శివాజీ బానిస బతుకులను చెరిపేసి హిందూ రాజ్యాన్ని స్థాపించిన ధీరుడని పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థులు



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

హైదరాబాదులోని హకింపేటలో ఈనెల 27 నుంచి నాలుగు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు సిద్దిపేట జిల్లా నుంచి 20 మంది విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకట నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో గత నెల 31న నిర్వహించిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల ఎంపిక పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 110 మందికి గాను 86 మంది విద్యార్థులు హాజరై, బ్యాటరీ టెస్టుల్లో చూపిన ప్రతిభ ఆధారంగా 10 మంది బాలికలు, 10 మంది బాలురు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిలో బాలికల విభాగం నుంచి ఆడేపు రిషిక (సిద్దిపేట అర్బన్), మట్టల షణ్ముఖ రాయి (హుస్నాబాద్), దూలిమిట్ట హరిణి (చిన్నకోడూరు), దుబ్బాక అన్విశ్రీ పటేల్ (హుస్నాబాద్), లింగాల అభిజ్ఞా రెడ్డి (సిద్దిపేట రూరల్), సానియా హబ్సిన్ (హుస్నాబాద్), గడవేరుగు ఆద్యశ్రీ (అక్బర్ భూంపల్లి), రెడ్డి రేణుక (సిద్దిపేట రూరల్), కొమ్మిడి సాత్విక రెడ్డి (సిద్దిపేట రూరల్) ఎంపికయ్యారు. బాలుర విభాగం నుంచి మంద అక్షయ్ కుమార్ యాదవ్ (సిద్దిపేట రూరల్), మల్లం విశ్వవర్ధన్ (దూలిమిట్ట), బొజ్జ అభియాన్ (అక్కన్నపేట), బానోతు శ్రీ చరణ్ (అక్కన్నపేట), బట్ట మహాంష్ (సిద్దిపేట రూరల్), కనకాల రిశ్విత్ (నారాయణరావుపేట్), గుత్తికొండ రామేశ్వర్ (హుస్నాబాద్), కోర్సా చాణుక్య (మార్కూక్), తిరునగరి తశ్విన్ (జగదేవ్పూర్), బొజ్జ అశోక్ (హుస్నాబాద్)లు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, రాష్ట్రస్థాయిలో కూడా చక్కటి ప్రతిభ కనబరిచి హకింపేట, ఆదిలాబాద్, కరీంనగర్, హనుమకొండ ప్రాంతీయ క్రీడా పాఠశాలలకు ఎంపికై జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అధికారి ఆకాంక్షించారు.

## కేజీబీవీలో ఐఐటి, జేఈఈ కోచింగ్ ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యక్రమం భాగంగా ఇంటర్మీడియట్‌తోపాటు ఐఐటి, జేఈఈ కోచింగ్‌ను ప్రారంభిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ కవిత తెలిపారు. ఆసక్తిగల పదవ తరగతి విద్యార్థినులు సంబంధిత వెబ్ పోర్టల్‌లో అర్హత పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 15లోగా దరఖాస్తు చేయాలని, మే 3న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

## కుస్తీ పోటీలో గాయపడి వ్యక్తి మృతి

**ముద్ర న్యూస్ :**

కుస్తీ పోటీలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం అభంగపట్నంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం స్థానిక పాఠశాల ఆవరణలో గ్రామస్థులు కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో రెంజల్ మండలం బాగేపల్లికి చెందిన మల్లయోధుడు ఎ. లక్ష్మణ్ (48) మరో మల్లయోధుడితో పోటీ పడ్డారు. ఈ క్రమంలో లక్ష్మణ్ మెడకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108 అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అదే రోజు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణ్ శుక్రవారం మృతి చెందారు. ఘటనపై విచారణ కొనసాగుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## వైభవంగా గజ్జలమ్మ రథోత్సవం

**ముద్ర న్యూస్ :**

గజ్జలమ్మ జాతర సందర్భంగా బీర్కూరు మండల కేంద్రంలో శుక్రవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవాన్ని సర్పంచి ఆరిగే ధర్మతేజ ప్రారంభించారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే స్థానిక గజ్జలమ్మ ఆలయం నుంచి రథాన్ని గ్రామంలోని పలు వీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాములు, ఉప సర్పంచి పరమేశ్ పంతులు, గ్రామపంచాయతీ కార్యదర్శి గంగారం, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బాధితుడికి సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**ముద్ర న్యూస్ :**

సీబరంగెడ్డికి చెందిన మేత్రి హన్మగౌండ ఇటీవల పక్షవాతం బారిన పడ్డారు. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కొన్ని రోజులు చికిత్స పొందారు. ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు హన్మగౌండకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.41 వేల చెక్కును గ్రామ సర్పంచి శుక్రవారం బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయం

- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన పాత్ర కీలకం : మంత్రి దామోదర రాజనర్సింహ



**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రైతుల హక్కుల కోసం, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన ధైర్యసాహసాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా శుక్రవారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోతిరెడ్డిపల్లిలోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి మంత్రి, కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమురయ్య చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని, ఆయన స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దొడ్డి కొమురయ్య వంటి మహనీయుల ఆశయాలను సాకారం చేయడం ద్వారానే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ ఉద్యమానికి నాంది పలికిన అమరవీరుడు, రైతాంగ గళంగా నిలిచిన గొప్ప నాయకుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. యువత ఆయన జీవితం నుంచి ప్రేరణ పొందుతూ సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం అనే విలువలను పాటిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు చింతా ప్రభాకర్, సంగారెడ్డి, ఇస్నాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌లు కూన వనిత, సుమలత శ్రీకాంత్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీశ్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం మల్లయ్య, జనరల్ సెక్రటరీ తాటిపల్లి పాండు, బీసీ సంఘం యూత్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు దొడ్డి కొమురయ్య - ఎమ్మెల్యే చింత ప్రభాకర్**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రైతుల హక్కుల కోసం, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు దొడ్డి కొమురయ్య అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కొనియాడారు. ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరాలకు మార్గదర్శకమన్నారు. దొడ్డి కొమురయ్య త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డా. శ్రీహరి, పట్టణ అధ్యక్షుడు ఆర్. వెంకటేశ్వర్లు, లాడే మల్లేశం, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం : కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడని తెలిపారు. అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడిగా ఆయన చరిత్రలో నిలిచారన్నారు కొమురయ్య చూపిన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు. ప్రజల హక్కులు, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని తెలిపారు. సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, వెనుకబడిన తరగతుల సహాయ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, బీసీ సంఘ నాయకులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు దొడ్డి కొమురయ్య అని చిన్నకోడూరు ఎస్సై చంద్రమోహన్, సిద్దిపేట కురుమ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోతుగంటి రవికాంతులు అన్నారు. కురుమ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు కురుమ సంక్షేమ సంఘ భవనంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమురయ్య అని, ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నేతలు శ్రీనివాస్, రాములు, రాజు, మల్లేశం, భోగేశ్వర్, రమేష్, సతీష్, ప్రశాంత్, పరశురాములు, అజయ్, రాములు తదితరులు పాల్గొన్నారు.





## సిఎస్ఐ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు



- వేకువజామున నుంచే ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సిఎస్ఐ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున నుంచే ప్రెస్బిటరీ ఇన్‌చార్జ్ శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా బిషప్ ఎమెరిటస్ రైట్ రేవ. టి.ఎస్. కనక ప్రసాద్ భక్తులకు దైవ సందేశాన్ని వినిపించారు. మానవాళి పాప విమోచన కోసం యేసు క్రీస్తు తన ప్రాణాలను త్యజించారని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఈస్టర్‌కు ముందు వచ్చే శుక్రవారాన్ని గుడ్ ఫ్రైడేగా నిర్వహిస్తారు. ఈ ప్రార్థనల్లో హైదరాబాద్, నిజామాబాద్, కర్ణాటక ప్రాంతాల నుండి భక్తులు పాల్గొన్నారు.



## గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

- గిరిజన సంక్షేమాధికారి నీలిమ

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమాధికారి నీలిమ తెలిపారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సమన్వయంతో కేరళ రాష్ట్రంలోని కోచ్చిలో గల నైపుణ్య శిక్షణాభివృద్ధి సంస్థలో మే 2026లో ప్రారంభమయ్యే తదుపరి బ్యాచ్ కోసం తెలంగాణ రాష్ట్ర గిరిజన యువతకు 25 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అర్హులైన గిరిజన నిరుద్యోగ యువతీ యువకుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లాలోని ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను పూర్తి చేసి ఈనెల 10లోపు సమర్పించాలని సూచించారు.

**కోర్సులు :**

ఇండస్ట్రియల్ ఎలక్ట్రిషియన్, ఇండస్ట్రియల్ వెల్డర్, ప్రాసెస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, టెక్నీషియన్ ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కోర్సు వ్యవధి 6 నెలలు ఉంటుందని పేర్కొన్నారు.

## దుబ్బాక మైనారిటీ పాఠశాల, కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



దుబ్బాక మైనారిటీ పాఠశాల, కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్ఎల్‌సీ బహుమతి తెలిపారు. ముస్లిం మైనార్టీ విద్యార్థుల కోసం 75 శాతం, ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, జైనులు, సిక్కులు, బౌద్ధ విద్యార్థుల కోసం 25 శాతం సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ కోర్సులతో పాటు 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. మరింత సమాచారం కోసం 73311 70826, 98855 95256, 9652595640 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
04.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ 10 ల్యాప్‌టాప్‌లు : HP పెవిలియన్ 15
బడ్జెట్‌లో మంచి ఆల్‌రౌండర్
విద్యార్థులు & ఆఫీస్ పనులకు సరైన ఎంపిక





# మాట మార్చిన కవిత

- మళ్లీ టీఆర్ఎస్ పాట
- బీఆర్ఎస్ ఎత్తుగడ కోసమే ప్లాన్
- ఇప్పటికే ప్రజా జాగృతి పేరుతో అప్లికేషన్..
- తాజాగా టీఆర్ఎస్ పేరు వచ్చేలా కవిత వ్యాఖ్యలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కుటుంబంతో విభేదించి.. ప్రస్తుతం జాగృతి సంస్థ పేరుతో రాష్ట్రమంతా తిరుగుతున్న కల్వకుంట్ల కవిత.. బీఆర్ఎస్ ముందు మైండ్ గేమ్ ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే ఓ పేరును ఖరారు చేస్తూ ఎన్నికల సంఘంలో కవిత తరపు ప్రతినిధులు ఓ అప్లికేషన్ పెట్టారు. కానీ, తాజాగా కవిత చేసిన వ్యాఖ్యలు మళ్లీ టీఆర్ఎస్ వైపు తిప్పుతున్నాయి. కేసీఆర్ కుమార్తె గా గుర్తింపు దక్కించుకున్న కవిత టీఆర్ఎస్ పేరుతో పార్టీ పెట్టే ఆలోచనలో ఉన్నట్టు కనిపిస్తోంది. ప్రజల మూడ్, బీఆర్ఎస్ ఎత్తుగడ తెలుసుకునేందుకు ఆమె ఓ లీక్ ఇచ్చినట్టు తెలుస్తోంది.

**టీఆర్ఎస్ పేరే ఓ అటాచ్ మెంట్**

టీఆర్ఎస్... ఈ పేరుతో తెలంగాణ ప్రజలకు ప్రత్యేకమైన అటాచ్‌మెంట్ ఉంది. తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో ప్రత్యేక పార్టీ పెట్టి ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన పోరాటాలను కథల కథలుగా చెప్పుకుంటారు తెలంగాణ ప్రజలు. లేటెస్ట్ పాలిటిక్స్‌లో చాలా పార్టీలకు టీఆర్ఎస్ రోల్ మోడల్. ప్రత్యేక రాష్ట్ర సాధించిన పార్టీగా టీఆర్ఎస్‌కు ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం ఉంది. అయితే పార్టీని వేరే రాష్ట్రాల్లో విస్తరించాలనే ఆలోచనతో తెలంగాణ రాష్ట్ర సమితిని, భారత రాష్ట్ర సమితిగా మార్చి సరికొత్త నినాదాన్ని అందుకున్నారు కేసీఆర్. తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. ఇప్పుడు తన కుమార్తె కవిత టీఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీ పెట్టాలని ఆలోచన చేస్తున్నట్టు కనిపిస్తోంది. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె చేసిన కామెంట్స్ సంచలనంగా మారుతున్నాయి.

**అందుబాటులో ఉంది..**
**ఎవరైనా ట్రై చేసుకోవచ్చు**

బంజారాహిల్స్‌లోని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆమె సమావేశం పెట్టింది ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై అయినా సరే రాజకీయంగా కూడా కొన్ని కామెంట్స్ చేయడం సంచలనంగా మారింది. తన పార్టీ గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానంగా టీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు అందుబాటులో ఉందని, దాన్ని ఎవరైనా పెట్టుకోవచ్చని అన్నారు. తన పార్టీ ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల మేరకే నడుస్తుందని చెప్పారు. తమకు ఇతర రాష్ట్రాల సిద్ధాంతకర్తలు అవసరం లేదని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ఫ్రీ అయిందని చెప్పడం వెనుక కవిత పార్టీ పేరు అదే అయి ఉంటుందని ప్రచారం మొదలైంది. ఈ నెలాఖరున పార్టీ పేరు అజెండా ప్రకటిస్తానంటూ ఆమె చెప్పుకొచ్చారు. ఈ పేరును వదిలేసిన బీఆర్ఎస్ నుంచి ఎలాంటి రియాక్షన్ వస్తుంది. ప్రజల్లో వచ్చే స్పందన ఏలా ఉంటుందనే విషయాల గురించి తెలుసుకునేందుకు మీడియా సమావేశంలో కవిత ఇలాంటి కామెంట్స్ చేసి ఉంటారని విశ్లేషకులు అంటున్నారు.

**కవిత ప్లాన్ ఏమిటి..?**

ఇప్పుడు ఆ టీఆర్ఎస్ పేరుతో పార్టీ పెట్టేందుకు కవిత రెడీ అయ్యిందనే వార్తలు వస్తున్నాయి. కవిత తెలంగాణ జాగృతిని నడుపుతున్నారు. అది కలిసి వచ్చేలా తెలంగాణ ప్రజా జాగృతి పేరుతో పార్టీ పెడతారని ప్రచారం జరిగింది. ఈ విషయంలో కోర్టులను కూడా ఆశ్రయించారు. కానీ ఇంతలో ఆమె ఇవాళ్టి ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలతో టీఆర్ఎస్ పేరుతో ప్రజల ముందుకు వస్తున్నారా అనే చర్చ మొదలైంది.బీఆర్ఎస్ విభేదించి వేరే పార్టీ పెట్టుకునేందుకు సిద్ధమవుతున్న కవిత ఒకవేళ టీఆర్ఎస్ పేరుతో వస్తే తమకు భారీ నష్టం కలుగుతుందని భావిస్తే కచ్చితంగా ఆ పార్టీ లీడర్లు అన్ని విధాలుగా అడ్డుకునే ప్రయత్నం చేస్తారు. ఇదే జరిగితే కవిత పేరు మారుమాగుతుంది. ఆమెకు మేలు జరిగే ఆస్కారం ఉంది. వాళ్ల నుంచి అభ్యంతరం రాకపోతే టీఆర్ఎస్‌పై ప్రజల్లో ఉండే ఎమోషన్‌కు కవిత ఉపయోగించుకునే ఛాన్స్ లేకపోలేదు.

# ప్రైవేట్ విద్యాలయాల నిలువు దోపిడి

- ఒకేసారి 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచారు
- జాగృతి ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తాం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్డగోలుగా ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఒకేసారి 30 నుంచి 40 శాతం వరకు ఫీజులు పెంచడం దారుణమని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, ఇందుకోసం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించి బిల్లు ఆమోదించాలన్నారు.రాష్ట్రంలో సుమారు 12 వేల ప్రైవేట్ స్కూళ్లలో 38 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్న కవిత, ఈ స్థాయిలో ఉన్న విద్యా వ్యవస్థలో నియంత్రణ లేకపోవడం ఆందోళనకరమని అన్నారు. తల్లిదండ్రుల ఆదాయం పెరగకపోయినా, స్కూల్స్ మాత్రం భారీగా ఫీజులు పెంచడం అన్యాయమన్నారు. ప్రభుత్వం అనుమతించే ఫీజుల పెంపు గరిష్టంగా 7 నుంచి 8 శాతం మాత్రమే ఉండాలని సూచించారు. కార్పొరేట్ స్కూళ్లు, ముఖ్యంగా నార్త్ ఇండియన్ విద్యాసంస్థలు తెలంగాణ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వడంలేదని ఆరోపించారు. అదే సమయంలో, ఆ సంస్థలు కోట్లలో ఆదాయం పొందుతున్నప్పటికీ టీచర్లు, సిబ్బందికి సరైన జీతాలు, సౌకర్యాలు కల్పించడంలేదన్నారు. పాఠ్య పుస్తకాలను అధిక ధరలకు విక్రయించడం, విద్యార్థులపై అదనపు భారాన్ని మోపడం వంటి అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రైవేట్ ప్రొఫెషనల్ కాలేజీలు ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిల పేరుతో విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయడం సరైంది కాదని కవిత స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఈ విధానాన్ని కొనసాగించడం వల్ల విద్యార్థులు ఉద్యోగ, ఉన్నత విద్య అవకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ బాధ్యతలు కూడా చేపట్టడం దురదృష్టకరమని వ్యాఖ్యానించిన కవిత, విద్యావ్యవస్థలో జరుగుతున్న సమస్యలపై సరైన సమీక్ష లేకపోవడం విచారకరమన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు.ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కవిత హెచ్చరించారు.

# ఈ నెలలోనే రైతు భరోసా రెండో విడుత

- నిధుల సర్దుబాటుకు సీఎం ఆదేశం
- రూ. 2,650 కోట్లకు గ్రీన్ సిగ్నల్
- కొత్తగా అప్లై చేసిన వారికి కూడా విడుదల

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



రైతు భరోసా రెండో విడత నిధుల జమ పైన స్పష్టత ఇచ్చింది. మూడు విడతల్లో రైతు భరోసా నిధులను జమ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం అందులో భాగంగా తొలి విడత నిధులను విడుదల చేసింది. కాగా, రెండో విడత నిధులు ఏ కేటగిరీలో రైతుల ఖాతాల్లో జమ చేయనుందో స్పష్టం చేసింది. దీంతో, రైతు భరోసా నిధుల కోసం వేచి చూస్తున్న రైతులకు రిలీఫ్ దక్కనుంది. ఏప్రిల్ రెండో వారంలోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీఎం రేవంత్ తాజాగా రైతుల భరోసా నిధుల పైన సమీక్ష చేసారు. రైతులకు ఇచ్చిన హామీ విధంగా నిధులు జమ చేయాలని నిర్దేశించారు. అందులో భాగంగా ఆర్థిక శాఖ రూ.2,650 కోట్లను సమీకరించే పనిలో పడింది. ప్రభుత్వ ఖర్చులు, ఇతర చెల్లింపులతో పాటుగా రైతులకు భరోసా కింద అవసరమైన నిధులు అందించేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేసారు. రెండో విడతలో ఎకరానికి మించి భూమి ఉన్న రైతులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ముఖ్యంగా సుమారు 5 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులు ఈ దఫాలో ప్రయోజనం పొందనున్నారు.

రాష్ట్రంలోని కోట్లాది మంది రైతులు ఎదురు చూస్తున్న రైతు భరోసా పథకానికి సంబంధించిన కీలక అప్‌డేట్ వచ్చేసింది. రైతులకు ఇవ్వాల్సిన మిగతా డబ్బులను మరో రెండు విడతల్లో ఈ నెలలోనే జమ చేయాలని ప్రభుత్వ ఆలోచన చేస్తోంది. ఇప్పటికే మార్చిలో ఒక విడత నిధులు జమ చేశారు. ఇప్పుడు రెండో విడతను వారం పది రోజుల్లో విడుదల చేస్తారు. మిగతా సొమ్మును ఈ నెలాఖరుకు ఖాతాల్లో డిపాజిట్ చేయనున్నారు. గతంలో అమలైన రైతు బంధు పథకంతో పోలిస్తే ప్రస్తుతం ఉన్న రైతు భరోసా పథకంలో ప్రభుత్వం చాలా మార్పులు చేసింది. గతంలో ఎకరాకు ఏడాదికి పదివేల రూపాయలు ఇచ్చే వారు. కానీ ఇప్పుడు ఆ మొత్తాన్ని పన్నెండు వేలకు పెంచారు. అంటే ప్రతి సీజన్‌కు ఆరువేల రూపాయల చొప్పున రైతులకు అందజేస్తున్నారు.

**మూడు విడతల్లో రైతుల ఖాతాల్లోకి నిధులు**

రాష్ట్రంలో ఈ సీజన్ కోసం మొత్తం 9వేల కోట్లను మూడు విడతల్లో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో మార్చి 23నుంచి 3590 కోట్లను రైతుల ఖాతాల్లో వేశారు. రెండో విడతను ఏప్రిల్ రెండో వారంలో 2650 కోట్లను విడుదల చేయనున్నారు. ఇందులో ఐదు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు ప్రాధాన్యత ఇస్తారు. మూడో విడతను ఏప్రిల్ చివరి నాటికి 2, 760 కోట్లను విడుదల చేస్తారు. రాష్ట్రంలో నిధుల కొరత ఉన్నందున వీటిని జమ చేసే విధానంలో సరికొత్త వ్యూహాన్ని అనుసరిస్తోంది ప్రభుత్వం గతంలో తక్కువ భూమి ఉన్న వారికి ముందుగా డబ్బులు వేసే వారు. దీంతో మిగతా వాళ్లకు ఎప్పుడో వచ్చేవి. ఇప్పుడు దానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. ఇప్పుడు భూమి ఎంత ఉన్నా సరే మొదటి ఎకరాకు సంబంధించిన ఆరు వేల నిధులను ఒకేసారి విడుదల చేస్తున్నారు. దీని వల్ల రాష్ట్రంలోని 70లక్షల మంది రైతులకు ఒకేసారి లబ్ధి జరుగుతుంది.

**కొత్త అప్లకేషన్లకు కూడా**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సమన్వయం చేస్తూనే రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ దశల వారీగా పంపిణీ ప్లాన్ అమలు చేస్తోంది. అందులో భాగంగానే కేవలం సాగు అవుతున్న వ్యవసాయం భూములకు మాత్రమే ఈ సాయం అందిస్తున్నారు. భూభారతిలో నమోదు అయిన భూములకే సాయం అందుతోంది. ఇప్పుడు ఫిబ్రవరిలో కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు అందుతున్న వేల మంది రైతులకు కూడా సాయం అందజేయనుంది. అయితే వీళ్లంతా ఏప్రిల్ 25 లోపు ఆధార్, పాస్ బుక్, బ్యాంకు వివరాలను ఏఈవోకు అందజేయాలి. రైతులు తమ నిధుల స్థితిగతులను తెలుసుకోవడానికి ప్రభుత్వం ఆన్‌లైన్ సౌకర్యాన్ని కల్పించింది. రైతు భరోసా అధికారిక వెబ్‌సైట్ rythubharosa.telangana.gov.in సందర్శించాలి. స్టాటస్ చెక్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. మీ ఆధార్ నెంబర్‌లేదా రిజిస్టర్డ్ వివరాలు నమోదు చేయాలి. దీని ద్వారా మీ ఖాతాలో నగదు జమ అయిందా లేదా అని తెలుస్తుంది.

# మా చిత్తశుద్ధికి నిదర్శనమిది




- ఉద్యోగ నియామకాలపై సుప్రీం తీర్పును స్వాగతించిన సీఎం రేవంత్
- గ్రూప్ 1 నియామకాలకు లైన్ క్లియర్
- హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకోబోమన్న సుప్రీం కోర్టు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో గ్రూప్1 నియామకాలపై రాష్ట హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సీఎం రేవంత్ రెడ్డి స్వాగతించారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల తమ ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి.. కొలువుల కోసం ఏళ్లకు ఏళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి, కన్నవారి కష్టం పై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ 1 ఆశావహులకు ఇది పెద్ద ఊరట అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చీరావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసిందన్నారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్ నిర్మాణంలో తొలి గ్రూప్ 1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామన్నారు. ఉద్యోగాలను ఎంపికైన వారికి మరో సారి నా అభినందనలు అని తెలిపారు. ప్రభుత్వం ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించామన్నారు. అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ ఛైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

**హైకోర్టు తీర్పు సబబే..**

తెలంగాణ గ్రూప్1 నియామకాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. రాష్ట్రంలో గ్రూప్1 నియామకాలపై రాష్ట హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ ను ఈ నెల 2న సుప్రీంకోర్టు డిస్మిస్ చేస్తూ హైకోర్టు తీర్పును సమర్థించింది. ఉద్యోగాల నియామకాల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎంపిక ప్రక్రియ, మూల్యాంకనంలో తప్పులున్నాయని, ఈ నోటిఫికేషన్ రద్దు చేసి తిరిగి పరీక్షలు నిర్వహించాలని సుప్రీంకోర్టును కోరారు. నియామకాలు కొనసాగించవచ్చని హైకోర్టు తీర్పునిచ్చిందని, అభ్యర్థుల వాదనలు పరిగణనలోకి తీసుకోకుండా హైకోర్టు తీర్పు వెల్లడించిందని పిటిషన్‌లో అభ్యర్థులు పేర్కొన్నారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఈ పిటీషన్లపై విచారణ జరిపింది. వీరి వాదోపవాదనలు విన్న సుప్రీం ధర్మాసనం... హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. ఈ క్రమంలో దాఖలైన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

# సేవలన్నీ వాట్సాప్ లోనే..

- మీ సేవ, ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ తిరగక్కర్లేదు!
- 80969 58096 నంబర్ ను సేవ్ చేసుకోండి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




ప్రజలకు అందించే సేవలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మీ సేవ సర్వీసులు, టెన్త్, ఇంటర్ హాల్ టికెట్లతోపాటు పలు సర్వీసులను వాట్సాప్ ద్వారా అందిస్తుండగా.. మరిన్ని సేవలను కూడా డిజిటల్‌గా అందించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ శాఖలన్నింటినీ వాట్సాప్‌తో లింక్ చేయనున్నారు. త్వరలోనే పలు పథకాలకు కూడా వాట్సాప్‌లో అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది.

తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ సేవల వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఒక్క క్లిక్‌తో ప్రభుత్వ సేవలను.. మన అరచేతిలోకే తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతోంది. మీసేవ, ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ తిరిగే అవకాశం లేకుండా.. సెల్‌ఫోన్‌లోనే చూసుకునేలా ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ పాలనను.. ప్రజల చేతిలోకి తీసుకువచ్చేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మీసేవ ద్వారా అందే సేవలు, ఇంటర్, పది పరీక్షల హాల్ టికెట్లను ఇప్పటికే వాట్సాప్‌లో అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వం.. ప్రభుత్వ సేవలను కూడా డిజిటల్‌గా అందుబాటులోకి తెస్తోంది.

**ఒక్కొక్కటిగా లింక్**

ఒక్కొక్కటిగా వివిధ శాఖల సేవలను కూడా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్‌తో లింక్ చేస్తోంది. ఇలా చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్రతీ సేవకు సంబంధించిన లింక్ ఒక్క వాట్సాప్ మెసేజ్‌తో అరచేతిలోకి రానుంది. అదే సమయంలో భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి ఉద్యోగ పరీక్షలకు సంబంధించిన రిక్రూట్‌మెంట్ బోర్డులు కూడా ఈ వాట్సాప్‌నే వినియోగించేలా ప్లాన్లు కూడా జరుగుతున్నాయి. ఇక ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్ అయి వాట్సాప్‌లో అందుబాటులోకి వస్తే.. ఇంటర్నెట్ సెంటర్లు, మీసేవ సెంటర్ల చుట్టూ తిరిగే పని లేకుండా కేవలం వాట్సాప్ ద్వారా ప్రజలకు సేవలు అందుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ వాట్సాప్ సేవల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 80969 58096 అనే నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో వేర్వేరు డిపార్ట్‌మెంట్‌లకు వేర్వేరుగా ఉన్న పోర్టల్‌లతో తీవ్ర గందరగోళం ఏర్పడగా.. దానికి స్వస్తి పలుకుతూ ఈ ఇంటిగ్రేటెడ్ విధానాన్ని తీసుకువచ్చి అన్ని సేవలకు ఒకే వాట్సాప్ నంబర్‌ను తీసుకువచ్చారు. ప్రజల ఫిర్యాదుల దగ్గరి నుంచి సర్టిఫికెట్ల జారీ వరకు అన్నింటినీ ఒకే దగ్గరికి చేర్చే విప్లవాత్మక మార్పులు తెస్తున్నారు. కేవలం సమాచారం కోసమే మాత్రమే కాకుండా నేరుగా సేవలు పొందే వేదికగా మార్చారు. ఇటీవల పలు ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన హాల్ టికెట్లను కూడా వాట్సాప్‌లో అందుబాటులో ఉంచారు. కేవలం రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ, పేరు వంటి వివరాలు ఎంటర్ చేయగానే హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే అవసరం కల్పించారు. రానున్న రోజుల్లో స్టేట్ లెవల్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను కూడా వాట్సాప్‌లోనే అందించనున్నారు. రిజల్ట్స్ కూడా తెలుసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. ప్రభుత్వ మెసేజ్‌లు, అలర్ట్‌లు కూడా ఇదే వాట్సాప్ నంబర్ ద్వారా ప్రజలకు చేరనున్నాయి. ప్రస్తుతం మీసేవ పోర్టల్‌లో లభించే దాదాపు అన్ని సేవలు వాట్సాప్‌లో అందుతున్నాయి. కులం, ఆదాయం వంటి సర్టిఫికెట్లు, వాటి స్టేటస్ తెలుసుకోవడం దగ్గరి నుంచి మున్సిపల్ ట్యాక్స్‌ల చెల్లింపు వరకు వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయి. రెవెన్యూ, విద్యుత్, పౌరసరఫరాల వంటి కీలక శాఖల సమాచారం కూడా అరచేతిలోకి తెచ్చారు. హాయ్ అని ఒక్క మెసేజ్ చేస్తే చాలు ఆప్షన్లతో కూడిన మెనూ ప్రత్యక్షం అవుతుంది. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అన్నింటినీ ఈ వాట్సాప్ చాట్‌బాట్‌కు లింక్ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి వంటి పథకాలకు దరఖాస్తు చేసుకోవడం.. అర్హతలు చెక్ చేసుకోవడం, రేషన్ కార్డులు, పెన్షన్ల జారీ మరింత సులభం కానుంది. లబ్ధిదారుల అకౌంట్లలో ప్రభుత్వం వేసే డబ్బుల సమాచారం కూడా వాట్సాప్ మెసేజ్‌లో అందించనున్నారు. ఒకే నంబర్‌తో రాష్ట్ర ప్రజలందరికీ అన్ని ప్రభుత్వ సేవలు అందేలా వన్ స్టాప్ షాప్ విధానాన్ని తీసుకురానున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
04.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ 10 ల్యాప్‌టాప్‌లు : లెనోవా ఐడియాపాడ్ స్లిమ్ 5
ధరకు తగ్గ మంచి ఫీచర్లు
డైలీ యూజ్‌కి సింపుల్ & రిలయబుల్



## కాషాయమయమైన కొండగట్టు అంజన్న క్షేత్రం

- మూడో రోజు కొనసాగిన భక్తుల రద్దీ
- ముగిసిన హనుమాన్ జయంతి ఉత్సవాలు
- లడ్డూలు లేక కౌంటర్ల వద్ద భక్తుల ఆందోళన

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు హనుమాన్ దీక్షాపరులతో కాషాయమయంగా మారింది. మూడు రోజులపాటు జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం కూడా భక్తుల రద్దీ ఏ మాత్రం తగ్గలేదు. రాష్ట్రం నలుమూలల నుంచి దీక్షాపరులు కొండగట్టుకు చేరుకుని స్వామి వారిని దర్శించుకుని, మాల విరమణ చేశారు. కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అంజన్నను దర్శించుకోవడానికి భారీగా తరలివచ్చిన భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించే విషయంలో అధికారులు చర్యలు తీసుకోలేదని, ప్రసాదం కౌంటర్ వద్ద సరిపడా లడ్డు ప్రసాదాలు లేక భక్తులు ఆందోళనకు దిగారు. ఎంతో దూరం నుంచి వస్తే కనీసం స్వామివారి ప్రసాదం కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసాదాలు అడిగితే దురుసుగా ప్రవర్తించిన ఆలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగడంతో పాటు నేరుగా ప్రసాదం తయారీ కేంద్రం దగ్గరకు వచ్చి ఓ భక్తుడు ఆందోళనకు దిగాడు.

**రోడ్డు ప్రమాదంలో దీక్షాపరులకు గాయాలు**

జగిత్యాల మండలం తక్కళ్లపల్లి సమీపంలో భూపాల్ పల్లికి చెందిన ఐదుగురు దీక్షాపరుల కారు ముందు టైరు పేలడంతో, అదుపు తప్పిన రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలు కాగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు.




## అధైర్య పడకండి, అండగా ఉంటాం

- మాజీ మంత్రి వర్యులు సబితా ఇంద్రారెడ్డి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

రైతులు అధైర్య పడవద్దు అని బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రైతులకు భరోసానిచ్చారు. శుక్రవారం పరిగి మండలం రాపోల్ ఖద్లాపూర్ గ్రామ రైతుల నిరసన దీక్షలో పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో కద్లాపూర్, రాపోల్ గ్రామాల్లో 12 వందల ఎకరాలను దోచుకునే కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసనగా 11వ రోజు రిలే నిరహార దీక్ష కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు. మీ కోసం తాము కూడా ఈ పోరాటంలో భాగమై, తమకు ఆసరాగా, మద్దతుగా ఉంటామని, అన్ని రకాలుగా అండగా నిలుస్తాం అని బి ఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందని మీ భూములు తీసుకోకుండా పోరాటం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాపోలు కద్లాపూర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## భారత అమ్ములపొదిలోకి ఐఎన్ఎస్ 'అరిదమాన్', 'తారాగిరి'

- అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ 'అరిదమాన్'
- శత్రువులకు చిక్కని 'తారాగిరి' యుద్ధ నౌక
- భారత నౌకదళం మరింత బలోపేతం

**ముద్ర డెస్క్ :**



భారత నౌకాదళ శక్తి మరింత బలోపేతం అవుతోంది. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిదమాన్ మరియు అత్యాధునిక స్టెల్త్ యుద్ధనౌక ఐఎన్ఎస్ తారాగిరి భారత అమ్ములపొదిలో చేరాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా వీటి కమిషనింగ్ జరగడం దేశ రక్షణ రంగానికి మరో కీలక మైలురాయిగా నిలిచింది. అరిదమాన్ అణుశక్తితో నడిచే సబ్‌మెరైన్ కావడం వల్ల దీర్ఘకాలం సముద్రంలోనే ఉండి శత్రువులకు తెలియకుండా పనిచేయగలదు. అరిహంత్, అరిఘాట్ తరువాత ఇది మూడో అణు జలాంతర్గామి. దీంతో భారత అణు నిరోధక శక్తి మరింత పెరిగింది. మరోవైపు, తారాగిరి స్టెల్త్ సాంకేతికతతో రూపొందిన యుద్ధనౌక. శత్రు రాడార్‌లకు చిక్కకుండా పనిచేసే సామర్థ్యం దీని ప్రత్యేకత. బ్రహ్మోస్, బరాక్ 8 వంటి శక్తివంతమైన క్షిపణులతో పాటు యాంటీ సబ్‌మెరైన్ వ్యవస్థలు కూడా ఇందులో ఉన్నాయి. సముద్ర సరిహద్దుల రక్షణలో ఇది కీలక పాత్ర పోషించనుంది. ఈ రెండు నౌకల ప్రవేశంతో భారత నౌకాదళం సామర్థ్యం మరింత పెరిగి, దేశ భద్రతకు బలమైన అండగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. స్వదేశీ సాంకేతికతతో ముందుకు సాగుతున్న భారత్, రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ దిశగా మరో అడుగు వేసింది.

# జర్నలిస్టులపై అప్రకటిత సెన్సార్‌షిప్

- కేంద్రం తీరుపై ఐజేయూ తీవ్ర ఆగ్రహం

**ముద్ర, అమరావతి:**

జర్నలిస్టులు, స్వతంత్ర డిజిటల్ మీడియా సంస్థలు, సోషల్ మీడియా వేదికల పట్ల ప్రభుత్వం అనుసరిస్తోన్న తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్ డి.సోమసుందర్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ విధానాలను విమర్శించే జర్నలిస్టులు, వ్యంగ్య రచయితలు, స్టాండప్ కమేడియన్లు, ఫ్యాక్ట్ చెకర్ల కంటెంట్‌ను, వీడియోలను ఏకపక్షంగా తొలగించడం, బ్లాక్ చేయడాన్ని "అప్రకటిత సెన్సార్‌షిప్'' గా ఐజేయూ అభివర్ణించింది. మొహమ్మద్ జుబేర్, మోలిటిక్స్, నేషనల్ దస్తక్, 4 పీఎం న్యూస్ వంటి సంస్థలతో పాటు స్టాండప్ కమేడియన్ రాజీవ్ నిగమ్ వంటి వారి సోషల్ మీడియా ఖాతాలను, కంటెంట్‌ను బ్లాక్ చేయడం కార్యనిర్వాహక అధికారాలను దుర్వినియోగం చేయడమేనని వారు మండిపడ్డారు. స్వతంత్ర జర్నలిజం గొంతు నొక్కడానికి ప్రభుత్వం చేస్తోన్న ఇటువంటి ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వారు హెచ్చరించారు. ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛపై ఇది నేరుగా జరుగుతున్న దాడి అని పేర్కొన్నారు. రహస్య విధానాలతో, అస్పష్టంగా ఉన్న చట్ట నిబంధనలను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం భిన్నాభిప్రాయాలను అణచివేయలేదని వారు స్పష్టం చేశారు. పరోక్ష సెన్సార్‌షిప్ విధించడం ద్వారా విమర్శనాత్మక జర్నలిజాన్ని అణచి వేయాలని చూస్తే దేశం మౌనంగా ఉండదని ఘాటుగా స్పందించారు. జర్నలిస్టులు, మీడియా సంస్థలపై జారీ చేసిన అన్ని ఏకపక్ష 'టేక్‌డౌన్' ఆర్డర్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఇటువంటి చర్యలకు గల కారణాలను బహిరంగంగా వెల్లడించాలని, జర్నలిస్టులను, స్వతంత్ర మీడియా ప్లాట్‌ఫారమ్‌లను భయభ్రాంతులకు గురిచేయడం ఆపాలని డిమాండ్ చేశారు. సెన్సార్‌షిప్‌ను ఎదుర్కొంటున్న జర్నలిస్టులు, మీడియా సంస్థలకు ఐజేయూ అండగా ఉంటుందని, మీడియా స్వేచ్ఛను హరించే ప్రతి ప్రయత్నాన్ని సమర్థవంతంగా ప్రతిఘటిస్తామని ఆ ప్రకటనలో హెచ్చరించారు.

# పేదల ఇండ్లు కూల్చే మీ నుంచి మేం నేర్చుకోవాలా..?

- సీఎం రేవంత్ పై కేరళం సీఎం పినరయి విజయన్ ఫైర్
- కేరళం అభివృద్ధి గురించి మాకు పాఠాలు చెప్పొద్దు
- అవినీతిలో ఆరో స్థానంలో తెలంగాణ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



తెలంగాణలో పేదల ఇండ్లను కూల్చే కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన దుస్థితిలో కేరళం ప్రజలు, ప్రభుత్వం లేదని కేరళ సీఎం పినరయి విజయన్ స్పష్టం చేశారు. కేరళలో అసెంబ్లీ ఎన్నికల సమరంలో యూడీఎఫ్ తరపున ప్రచారానికి వెళ్లిన రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు "సమాచారం లేని విమర్శలు"గా విజయన్ కొట్టిపారేశారు. శుక్రవారం సోషల్ మీడియా వేదికగా రేవంత్ రెడ్డికి ఘాటుగా సమాధానమిచ్చారు. తెలంగాణలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్న విషయాన్ని మరిచిపోయి, కేరళం అభివృద్ధి గురించి పాఠాలు చెప్పడానికి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఆయన్ని ఎవరో తప్పుదోవ పట్టించారని ఎద్దేవా చేశారు. నీతి ఆయోగ్ సుస్థిర అభివృద్ధి సూచీ (2023-24) ప్రకారం, కేరళ, దేశంలోనే అత్యంత తక్కువ అవినీతిరహిత గల రాష్ట్రంగా అగ్రస్థానంలో ఉందన్నారు. తెలంగాణ 6వ స్థానంలో ఉందని ఆయన గుర్తు చేశారు. కేరళలో పేదరికం రేటు కేవలం 0.55 శాతమని, ఇది దేశంలోనే అత్యల్పమన్నారు. అక్షరాస్యత, శిశు మరణాల రేటు తగ్గించడంలో కేరళ ఎంతో ముందుందని, తెలంగాణ కంటే మెరుగైన స్థితిలో ఉందని గణాంకాలను వివరించారు. జీతాలు, పెన్షన్లు సక్రమంగా చెల్లించలేని ప్రభుత్వం నడుపుతున్న వ్యక్తి నుంచి కేరళ నేర్చుకోవాల్సింది ఏమీ లేదు. కేరళ నుంచి పాలనా పాఠాలు నేర్చుకోవాల్సింది రేవంత్ రెడ్డే," అని విజయన్ చురకలంటించారు.

## హైకోర్టు తీర్పు విద్యార్థులకు వ్యతిరేకం

- బకాయిల విడుదలపై హైకోర్టు ప్రభుత్వానికి డెడ్ లైన్ పెట్టాలి
- ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసేందేకు రేవంత్‌రెడ్డి కుట్ర
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

**ముద్ర, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు పేద, మధ్య తరగతి విద్యార్థులకు వ్యతిరేకంగా ఉందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
ఫీజు రియంబర్స్మెంట్ రాని విద్యార్థుల వద్ద నుంచి ఫీజు వసూలు చేసుకోని, వచ్చిన తర్వాత విద్యార్థులకు తిరిగి చెల్లించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైంది కాదని వారు అభిప్రాయపడ్డారు. ఈ తీర్పుపై హైకోర్టు పునరాలోచించాలని, రాష్ట్రంలో లక్షలాదిమంది విద్యార్థులు ఉన్నత విద్య చదివేది ఫీజు రియంబర్స్మెంట్ పథకంపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. ఈ పథకానికి బకాయిలు చెల్లించకుండా నాలుగేళ్లుగా ప్రభుత్వాలు విద్యార్థుల చదువులతో చెలగాటమాడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఫీజు రియంబర్స్మెంట్ విడుదలపై ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించి ఆలోపు విడుదల చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

## తెలంగాణలో ఏ హామీలు అమలు జరిగాయో సీఎం వివరించాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్

**ముద్ర, హైదరాబాద్:**

తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం ఏమి సాధించిందో ఇక్కడ ఉన్న సీపీఐ, సీపీఎం నాయకులకు వివరించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేరళలో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన సీఎం, తెలంగాణలో ఆరు వాగ్దానాలను అమలు చేశామని చెప్పడం, అవసరమైతే రాష్ట్ర మంత్రివర్గం వచ్చి పరిశీలించవచ్చని తెలపడం హాస్యాస్పదమన్నారు. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వం సాధించిన విజయాలను తగ్గిస్తూ వ్యాఖ్యానించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలన్నీ ఏమాత్రం అమలు కాలేదని స్పష్టం చేశారు. అసత్యాలు వల్లే వేయడం తగదని హితవు పలికారు.



## వీర శైవ సమాజానికి అండగా ఉంటా

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**ముద్ర,వికారాబాద్ :**

సమాజ సేవలో ముందున్న వీరశైవ సమాజానికి తన వంతు సహకారం ఉంటుందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శ్రీ జగజ్యోతి బసవేశ్వర విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఎన్నేపల్లిలో కొత్తగా నిర్మించిన వీరశైవ బసవ భవనాన్ని శుక్రవారం ఆలయం ఆలంపల్లి కెంపిన, దుద్దిని పీఠాధిపతి డాక్టర్ చెన్న బసవ ప్రభు స్వామి, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. వీరశైవ సమాజం సభ్యులు ఐక్యతగా ఉండి నిర్మించిన బసవ భవన్ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. విద్యాసంస్థ అధ్యక్షుడు బస్వరాజ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, వికారాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ అనన్య, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు ఆకుల మహేష్ కుమార్, విద్యాసంస్థ బాధ్యులు పాల్గొన్నారు. అంతకు ముందు వీరశైవ ఆగమ పండితులు మఠపతి సాంబశివశర్మ, బస్వరాజ్ స్వామి, దైవజ్ఞ విశ్వేశ్వర్, మఠం చంద్రశేఖర్, పులుమద్ది మల్లేశం, పార్వతయ్య స్వామి ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకం నిర్వహించారు.

# జనగామ జిల్లాకు దొడ్డి కొమురయ్య పేరు

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- అక్కడ నిర్మించే విమానాశ్రయానికీ కూడా

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**





జనగామ జిల్లాకు దొడ్డి కొమురయ్య పేరుతో పాటు అక్కడ నిర్మించే విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టేలా కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతానని చెప్పారు. వచ్చే జయంతి వరకు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడారు. దొడ్డి కొమురయ్య పోరాట పటిమ నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కోకాపేట భూమి విషయంలో కొంతమంది రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. కులభివృద్ధి కోసమే కొంత భూమిని లీజ్ గా ఓ స్కూల్ కి ఇస్తే , దానిని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కురమ పిల్లల చదువుకు ఉపయోగపడుతుందని ఆ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ఎవరికైనా అభ్యంతరం ఉంటే జనరల్ బాడీ మీటింగ్ లో చెప్పాలన్నారు. కానీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం సరి కాదని హితవు పలికారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది శత జయంతి ఉత్సవాల లోపు ట్యాంక్ బండ్ పై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని దత్తాత్రేయ కోరారు. ఆయన చరిత్ర అన్ని పాఠ్య పుస్తకాల్లో పెట్టాలని సూచించారు. అసెంబ్లీలో ఒక్కరే ఎమ్మెల్యే ఉన్నారని చెప్పారు. విద్య ఉంటేనే గుర్తింపు ఉంటుందని.. తాను చదువుకున్న కాబట్టే ఎంపీ, కేంద్ర మంత్రి , గవర్నర్ స్థాయికి వెళ్ళానని అన్నారు. ప్రతి ఒక్కరు వారి పిల్లలను ఉన్నత చదివించాలని దత్తాత్రేయ సూచించారు. ఇటీవల కాలంలో బీసీలలో చాలా చైతన్యం వచ్చిందని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. కులాలుగా బీసీలు విడిపోవద్దని.. అప్పుడే రాజ్యాధికారం దక్కుతుందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు లేకున్న కూడా గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో 50 శాతం సీట్లలో బీసీలు గెలిచారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న దేశవ్యాప్త జనగణనలో బీసీలను అవమానం పరిచారని ఆరోపించారు. 33 ప్రశ్నలలో ఎస్సీ, ఎస్టీల ప్రస్తావన ఉందన్నారు. కానీ బీసీల ప్రస్తావన లేదన్నారు. బీసీలందరూ దేశవ్యాప్త జనగణనలో పాల్గొని బీసీల బలాన్ని చూపెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ చైర్మన్ కమలాకర్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రొ. రాములు, బీసీ కమిషనర్ బాల మాయా దేవి, డా. ఏలెందర్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
04.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ 10 ల్యాప్‌టాప్‌లు : ఆసస్ వివోబుక్ 15
స్టైలిష్ డిజైన్ +
బడ్జెట్ ఫ్రెండ్లీ
సాధారణ పనులకు
సరిపోతుంది



# ఐపీఎల్‌లో డబుల్ హెడర్ హంగామా..

- **వీకెండ్‌లో నాలుగు మ్యాచ్‌లు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**



ఐపీఎల్ 2026 సీజన్‌లో తదుపరి దశ ప్రారంభమైంది. ఇప్పటివరకు ఒక్కో రోజు ఒక్క మ్యాచ్ మాత్రమే జరగగా, ఇక నుంచి డబుల్ హెడర్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. అంటే శని, ఆదివారాల్లో ఒకే రోజు రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ వీకెండ్‌లో మొత్తం నాలుగు మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి.
ఏప్రిల్ 4 శనివారం రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. మొదటి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో తలపడతాయి. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రారంభమవుతుండగా, టాస్ 3 గంటలకు జరుగుతుంది. అదే రోజు రెండో మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ సాయంత్రం 7:30 గంటలకు ప్రారంభమవుతుంది, టాస్ 7 గంటలకు జరుగుతుంది.
ఏప్రిల్ 5 ఆదివారం కూడా రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. మొదటి మ్యాచ్ హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరుగుతుంది. అనంతరం సాయంత్రం చెన్నైలోని ఎం. చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడతాయి. ఈ రెండు మ్యాచ్‌లు కూడా శనివారం మాదిరిగానే మధ్యాహ్నం 3:30, రాత్రి 7:30 సమయాల్లో ప్రారంభమవుతాయి. ఈ రెండు రోజుల్లో జరిగే మ్యాచ్‌లు పాయింట్ల పట్టికపై భారీ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఏ జట్లు ముందంజలో ఉంటాయో, ఏ జట్లు వెనుకబడతాయో ఈ వీకెండ్ తర్వాత స్పష్టత రానుంది. దీంతో ఈ డబుల్ హెడర్ మ్యాచ్‌లపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

# చెపాక్‌లో సంజు మెరుపులేనా?..
## పంజాబ్‌పై భారీ ఇన్నింగ్స్ అంచనా



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

భారీ అంచనాల మధ్య సంజు శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి చేరినా, ఐపీఎల్ 2026 సీజన్ తొలి మ్యాచ్‌లో ఆశించిన ప్రదర్శన ఇవ్వలేకపోయాడు. తన పాత జట్టు రాజస్థాన్ రాయల్స్‌పై ఆడిన మ్యాచ్‌లో విఫలమవడంతో అభిమానులను నిరాశపరిచాడు. అయితే ఆ మ్యాచ్‌లో ఒత్తిడి కారణంగానే ఇలా జరిగిందని చాలామంది భావిస్తున్నారు.
ఇవాళ చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య చెపాక్ వేదికగా కీలక మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో సంజు నుంచి భారీ ఇన్నింగ్స్ వచ్చే అవకాశం ఉందని మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు.
చెపాక్ మైదానం సంజుకు ప్రత్యేకమైన వేదిక అని ఆయన పేర్కొన్నారు. గతంలో ఇదే మైదానంలో అతను అద్భుత ప్రదర్శన చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నాడని గుర్తుచేశారు. అందుకే ఈ మ్యాచ్‌లో పంజాబ్‌పై అతడు మెరుగైన ఆటతో మెరుస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. మొదట కొద్దిసేపు ఓపికగా ఆడుతూ బంతులను గమనించి, ఆ తర్వాత దూకుడుగా షాట్లు ఆడితే పెద్ద స్కోరు సాధించగలడని సూచించారు. సంజు ఫామ్‌లోకి వస్తే చెన్నై జట్టును ఆపడం కష్టమవుతుందని చెప్పారు. చెపాక్ పిచ్‌పై ముందుగా బ్యాటింగ్ చేస్తే 220కు పైగా స్కోరు చేస్తే విజయం అవకాశాలు పెరుగుతాయని ఆయన విశ్లేషించారు. పంజాబ్ జట్టు కూడా బలంగా ఉన్నప్పటికీ, చెన్నై కూడా బ్యాటింగ్‌లో సత్తా చాటగలదని తెలిపారు. సంజు దూకుడుగా ఆడితే ఈ మ్యాచ్‌లో పంజాబ్‌కు అవకాశాలు తగ్గిపోతాయని మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు.

## మరో రికార్డుకు
# చేరువలో బుమ్రా

- **ఢిల్లీ మ్యాచ్‌లోనే రెండో స్థానానికి చేరుకునే అవకాశం**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**



ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్ మధ్య ఎనిమిదో మ్యాచ్ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనుంది. ఈ మ్యాచ్‌లో ముంబై స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఒక కీలక రికార్డుకు చేరువలో ఉన్నాడు. ఐపీఎల్ చరిత్రలో ఫాస్ట్ బౌలర్‌గా అత్యధిక వికెట్లు తీసిన జాబితాలో రెండో స్థానాన్ని దక్కించుకునే అవకాశం అతనికి ఉంది.
ప్రస్తుతం ఈ జాబితాలో భారత పేసర్ భువనేశ్వర్ కుమార్ 199 వికెట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో డ్వేన్ బ్రావో, జస్ప్రీత్ బుమ్రా చెరో 183 వికెట్లతో ఉన్నారు. ఢిల్లీపై జరిగే ఈ మ్యాచ్‌లో బుమ్రా ఒక వికెట్ తీస్తే, బ్రావోను దాటి రెండో స్థానంలో నిలుస్తాడు. ఇక లసిత్ మలింగ 170 వికెట్లతో మూడో స్థానంలో ఉన్నాడు.
టీ20 ఫార్మాట్‌లో కూడా బుమ్రా అద్భుత గణాంకాలు నమోదు చేశాడు. ఇప్పటివరకు 271 మ్యాచ్‌లలో 345 వికెట్లు సాధించాడు. ఈ మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీస్తే, టీ20ల్లో 350 వికెట్ల మార్క్‌ను చేరుకునే రెండో భారత బౌలర్‌గా నిలిచే అవకాశం ఉంది. ప్రస్తుతం టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా యజువేంద్ర చాహల్ 386 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు.
ఇక మ్యాచ్ విషయానికి వస్తే, ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య పోరు ఆసక్తికరంగా ఉండనుంది. ఈ సీజన్‌లో ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి మంచి ఫామ్‌లో ఉన్నాయి. ముంబై తమ తొలి మ్యాచ్‌లో కోల్‌కతాను ఓడించగా, ఢిల్లీ లక్నోపై విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య జరగబోయే ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# యువ జట్టుకు సమయం ఇవ్వండి..

- **సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ కీలక వ్యాఖ్యలు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**



ఐపీఎల్ 2026 సీజన్‌ను పేలవంగా ఆరంభించిన చెన్నై సూపర్ కింగ్స్ మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. పంజాబ్ కింగ్స్‌తో తమ హోం గ్రౌండ్‌లో తలపడనున్న ఈ మ్యాచ్ జట్టుకు కీలకంగా మారింది. ఇప్పటికే ఎంఎస్ ధోని, బ్రెవిస్ వంటి కీలక ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడంతో సీఎస్‌కే యువ జట్టుతోనే బరిలోకి దిగుతోంది. కనీసం హోం మైదానంలో అయినా విజయం సాధించి పాయింట్ల ఖాతా తెరవాలని అభిమానులు ఆశిస్తున్నారు.
ఈ నేపథ్యంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం జట్టులో ఎక్కువ మంది యువ ఆటగాళ్లే ఉన్నారని, అనుభవజ్ఞుల జట్టుతో పోలిస్తే ఈ టీమ్‌కు కొంత వ్యత్యాసం సహజమని పేర్కొన్నాడు. కుర్రాళ్లు తప్పులు చేసినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి తమ ప్రతిభను చూపించేందుకు సమయం ఇవ్వాలని కోరాడు. ఒత్తిడి మధ్య యువ ఆటగాళ్లు తమ ఆటను మెరుగుపరచుకునేలా సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపాడు.
ఐపీఎల్ వంటి మెగా టోర్నీలో ప్రతి ఆటగాడిపైనా ఒత్తిడి ఉండటం సహజమని, కుటుంబ సభ్యులు, మీడియా, అభిమానుల నుంచి ఆశలు పెరగడం కూడా సహజమని రుతురాజ్ అన్నాడు. ఈ పరిస్థితుల్లో కుర్రాళ్లు స్థిరపడేందుకు కొంత సమయం అవసరమని స్పష్టం చేశాడు. త్వరలోనే జట్టు పుంజుకొని మంచి ఫలితాలు సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశాడు.
ఇదిలా ఉండగా, మోకాలి గాయం కారణంగా ఎంఎస్ ధోని కొన్ని మ్యాచ్‌లకు దూరంగా ఉండనున్నట్లు ఇప్పటికే జట్టు తెలిపింది. అయితే తాజాగా ట్రైనింగ్ సెషన్స్‌లో ధోని పాల్గొంటూ కనిపించడం ఆసక్తికరంగా మారింది. తన కిట్‌తో మైదానానికి వచ్చిన ఆయన యువ ఆటగాళ్లకు సూచనలు ఇస్తూ కనిపించాడు. ఆటగాళ్ల ప్రాక్టీస్‌ను దగ్గరుండి గమనించిన ధోని, తుది జట్టులోకి తిరిగి వచ్చే అవకాశంపై కూడా చర్చ మొదలైంది.

## ఖలీల్-శ్రేయస్ మధ్య
# హైటెన్షన్ పోరు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**






ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తమ రెండో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. తొలి మ్యాచ్‌లో పరాజయం పాలైన చెన్నై ఈ మ్యాచ్‌లో పునరాగమనం చేసి తొలి విజయాన్ని నమోదు చేయాలని చూస్తోంది. మరోవైపు పంజాబ్ జట్టు తమ విజయ పరంపరను కొనసాగించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో ఈ మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారనుంది. పంజాబ్ జట్టులో ప్రభసిమ్రన్ సింగ్, కూపర్ కానలీ, శ్రేయస్ అయ్యర్ వంటి బలమైన బ్యాట్స్‌మెన్ ఉండటంతో చెన్నై బౌలర్లకు ఇది కఠిన పరీక్షగా మారనుంది. ముఖ్యంగా శ్రేయస్ అయ్యర్‌ను త్వరగా అవుట్ చేయడం సీఎస్‌కేకు కీలకం కానుంది. ఈ మ్యాచ్‌లో ఖలీల్ అహ్మద్, శ్రేయస్ అయ్యర్ మధ్య పోరు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఐపీఎల్‌లో ఖలీల్ బౌలింగ్‌లో శ్రేయస్ రికార్డు అంతగా ఆకట్టుకునేలా లేదు. ఇప్పటివరకు ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో ఖలీల్‌ను ఎదుర్కొన్న శ్రేయస్, 25 బంతుల్లో కేవలం 33 పరుగులు మాత్రమే చేశాడు. ఈ క్రమంలో ఖలీల్ అతన్ని మూడుసార్లు అవుట్ చేశాడు. ఎడమచేతి పేసర్ల బౌలింగ్‌లో శ్రేయస్ ఇబ్బంది పడటం కూడా సీఎస్‌కేకు అనుకూలంగా మారవచ్చు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, చెపాక్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో హై స్కోరింగ్ మ్యాచ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవలి టీ20 మ్యాచ్‌ల్లో కూడా బ్యాట్స్‌మెన్ల ఆధిపత్యం కనిపించింది. దీంతో ఇరు జట్లు భారీ స్కోర్లు సాధించే అవకాశం ఉంది. మొత్తానికి చెన్నై, పంజాబ్ జట్ల మధ్య జరిగే ఈ పోరు అభిమానులకు మంచి వినోదాన్ని అందించనుంది. ఖలీల్ అహ్మద్, శ్రేయస్ అయ్యర్ మధ్య పోరే ఈ మ్యాచ్‌లో కీలకంగా మారే అవకాశం ఉంది.

# విమర్శకులపై రహానే ఫైర్..

- **“నా ఆటపై నాకే నమ్మకం”**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**



ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఓటమి పాలైన తర్వాత కెప్టెన్ అజింక్య రహానేపై విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా అతని స్లో బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు రావడంతో రహానే గట్టిగా స్పందించాడు. తనపై కావాలనే కొందరు నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డాడు.
తాను సాధించిన విజయాలు, క్రికెట్‌లో సంపాదించిన గుర్తింపును చూసి కొందరు అసూయ పడుతున్నారని రహానే పేర్కొన్నాడు. చిన్న చిన్న వైఫల్యాలను పెద్దగా చూపిస్తూ విమర్శలు చేయడం సరైంది కాదని అన్నాడు. తాను క్రీజులో ఉండటం ఇష్టం లేని వారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు.
స్ట్రైక్ రేట్ వివాదంపై కూడా రహానే స్పష్టంగా స్పందించాడు. 2023 నుంచి టీ20ల్లో తన స్ట్రైక్ రేట్ గణనీయంగా మెరుగుపడిందని గుర్తు చేశాడు. తన గణాంకాలను సరిగ్గా పరిశీలించకుండా విమర్శలు చేయడం సరికాదని ఎద్దేవా చేశాడు. పవర్ ప్లేలో భారతీయ బ్యాటర్లలో అభిషేక్ శర్మ తర్వాత తనకే మంచి స్ట్రైక్ రేట్ ఉందని పేర్కొన్నాడు.
ఒక బ్యాటర్‌గా ప్రతి మ్యాచ్‌లో ఒకే విధంగా ఆడటం సాధ్యం కాదని రహానే చెప్పాడు. పిచ్ పరిస్థితులు, బౌలర్ల వ్యూహాలు ప్రభావం చూపుతాయని వివరించాడు. తనపై విమర్శలు చేస్తున్నవారికి గేమ్ సెన్స్ ఉందో లేదో అనుమానం వ్యక్తం చేశాడు.
ఇతరుల మాటలను తాను పెద్దగా పట్టించుకోనని రహానే స్పష్టం చేశాడు. తన గురించి పాజిటివ్‌గా లేదా నెగిటివ్‌గా మాట్లాడినా అది తనపై ప్రభావం చూపదని తెలిపాడు. గత పదేళ్ల అనుభవంతో ఎలా ఆడాలో తనకు బాగా తెలుసని, బయటివారి సూచనలు అవసరం లేదని చెప్పాడు.
ముంబై ఇండియన్స్‌పై అద్భుత ఇన్నింగ్స్ ఆడిన రహానే, తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో విఫలమవ్వడంతో కేకేఆర్ అభిమానుల్లో ఆందోళన నెలకొంది. కెప్టెన్‌గా అతనిపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో, రాబోయే మ్యాచ్‌ల్లో ఎలా రాణిస్తాడో చూడాలి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
04.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ 10 ల్యాప్‌టాప్‌లు : ఎంఎస్ఐ జీఎఫ్63

తక్కువ ధరలో గేమింగ్ ల్యాప్‌టాప్ లైట్ గేమింగ్ + స్టడీస్‌కి బాగుంటుంది




## బైకర్ రివ్యూ : రేసింగ్ లు నచ్చేవారికి ఓకే




చాలా కాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్న శర్వానంద్, ఈసారి మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో వచ్చిన బైకర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. బైక్ రేసింగ్‌ను ప్రొఫెషనల్ స్పోర్ట్‌గా చూపిస్తూ, టెక్నాలజీ మరియు క్రమశిక్షణతో కూడిన ప్రపంచాన్ని ఈ సినిమా పరిచయం చేస్తుంది.

కథలో వికాస్ నారాయణ్ (శర్వానంద్) ఓ బైక్ రేసర్. అతని తండ్రి సునీల్ నారాయణ్ (రాజశేఖర్) ఒక లెజెండ్ అయినప్పటికీ గుర్తింపు దక్కదు. తన కొడుకును ఛాంపియన్ చేయాలని కఠినంగా ట్రైనింగ్ ఇస్తాడు. కానీ ప్రేమ, వ్యక్తిగత నిర్ణయాలు వికాస్ కెరీర్‌ను దెబ్బతీస్తాయి. ఓ కీలక పోటీలో ఓడిపోవడంతో తండ్రి, స్పాన్సర్లతో విభేదాలు వస్తాయి. ఈ పరిస్థితుల్లో తన తండ్రి కలను ఎలా నెరవేర్చాడనేదే కథ.

స్పోర్ట్స్ డ్రామాలో ముఖ్యమైన ఎమోషన్ ఈ సినిమాలో బాగానే వర్క్ అయింది. తండ్రికొడుకు భావోద్వేగం సినిమాకు బలంగా నిలిచింది. అయితే లవ్ స్టోరీ, ఫ్యామిలీ ఎలిమెంట్స్ కొంత మేర కథను స్లో చేస్తాయి. కథనం మాత్రం రొటీన్ ఫార్మాట్‌లోనే సాగుతుంది.

దర్శకుడు అభిలాష్ రెడ్డి బైక్ రేసింగ్ సీన్స్‌ను చాలా నేచురల్‌గా చూపించాడు. యువరాజ్ సినిమాటోగ్రఫీ, జిబ్రాన్ సంగీతం సినిమాకు ప్లస్ పాయింట్స్. అయితే రైటింగ్ లో కొంత లోపం కనిపిస్తుంది. శర్వానంద్ తన పాత్ర కోసం చేసిన కష్టం స్పష్టంగా కనిపిస్తుంది. రాజశేఖర్ పవర్‌ఫుల్ పాత్రలో మెప్పించారు. మాళవిక నాయర్ పాత్ర ఓకే అనిపిస్తుంది. అతుల్ కులకర్ణి విలన్‌గా బాగా చేశారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కాదు. రేసింగ్ అంటే ఇష్టం ఉన్నవారికి, స్పోర్ట్స్ డ్రామాలు చూసే వారికి బాగా నచ్చుతుంది. కానీ అలాంటి ఆసక్తి లేనివారికి మాత్రం బోర్ అనిపించే అవకాశం ఉంది.

**మైనస్ పాయింట్స్**
రొటీన్ సీన్స్
అనవసరమైన పాటలు

**ప్లస్ పాయింట్స్**
శర్వానంద్, రాజశేఖర్ నటన
విజువల్స్, టెక్నికల్ వాల్యూస్
రేసింగ్ సీన్స్
జిబ్రాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్

**రేటింగ్: 2.5/5**

ఫైనల్ వర్డ్: జెన్యూన్ అటెంప్ట్

—నరేష్, ముద్ర



## రాకాస మూవీ రివ్యూ: అక్కడక్కడా నవ్వించారు అంతే

నిహారిక కొణిదెల నిర్మాణంలో, మానస శర్మ దర్శకత్వంలో తెరకెక్కిన "రాకాస" చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సంగీత్ శోభన్ హీరోగా నటించిన ఈ సినిమా ఫాంటసీ, హారర్, కామెడీ మేళవింపుతో రూపొందింది. మంచి అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుందో చూద్దాం.

కథ విషయానికి వస్తే.. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వీరూ అనే యువకుడు తన చిన్ననాటి స్నేహితురాలు సుబ్బలక్ష్మిని పెళ్లి చేసుకోవడానికి స్వగ్రామానికి వస్తాడు. అయితే ఆమె ఇప్పటికే మరో వ్యక్తితో పెళ్లికి సిద్ధమై ఉంటుంది. ఆ పెళ్లిని అడ్డుకోవాలనే ప్రయత్నంలో వీరూ అనుకోని సమస్యల్లో ఇరుక్కుంటాడు. గ్రామానికి సమీపంలో ఉన్న కోటలో నివసించే రాక్షసుడికి బలిగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ కోటలోకి వెళ్లిన తర్వాత అతను ఎదుర్కొనే పరిణామాలు, అక్కడి రహస్యాలు సినిమా కథను ముందుకు నడిపిస్తాయి.

కథలో ఆసక్తికరమైన పాయింట్ ఉన్నప్పటికీ, దాన్ని తెరపై చూపించిన తీరు అంతగా ప్రభావం చూపించదు. రాక్షసుడి పాత్రలో భయం లేకపోవడం, కోటలో జరిగే సంఘటనల్లో ఉత్కంఠ తక్కువగా ఉండడం సినిమాకు ప్రధాన లోపాలుగా కనిపిస్తాయి. కథనం కొన్నిసార్లు చాలా తేలికగా, సిల్లీగా అనిపిస్తుంది. కొన్ని సన్నివేశాలు లాజిక్‌కు దూరంగా సాగడం వల్ల సినిమా ప్రభావం తగ్గుతుంది.

అయితే కామెడీ విషయంలో మాత్రం సినిమా నిరాశపరచదు. సంగీత్ శోభన్ తన టైమింగ్‌తో మళ్లీ ఆకట్టుకున్నాడు. వెన్నెల కిషోర్, గెటప్ శీను కలిసిన సన్నివేశాలు మంచి వినోదాన్ని అందిస్తాయి. ముఖ్యంగా కోటలో జరిగే కామెడీ ట్రాక్ ప్రేక్షకులను నవ్విస్తుంది. కొన్ని సన్నివేశాలు నిజంగా నవ్వుల విందు అందిస్తాయి.

నటన పరంగా సంగీత్ తన బలాన్ని మరోసారి నిరూపించాడు. హీరోయిన్ నయన్ సారిక పాత్రకు ప్రాధాన్యత ఉండటం మంచి విషయం. ఆమె కూడా తన పాత్రకు న్యాయం చేసింది. వెన్నెల కిషోర్, గెటప్ శీను తమ అనుభవంతో నవ్వులు పంచారు. మిగతా నటీనటులు తమ పరిధిలో బాగానే చేశారు.

సాంకేతికంగా సినిమా ఓకే అనిపిస్తుంది. పరిమిత బడ్జెట్ ఉన్నప్పటికీ విజువల్స్, సెట్స్ బాగున్నాయి. నేపథ్య సంగీతం సినిమాకు ప్లస్ పాయింట్. కొన్ని ఎమోషనల్ సన్నివేశాల్లో సంగీతం బాగా పనిచేసింది. దర్శకత్వంలో మానస శర్మ కొత్త ప్రయత్నం చేసినా, కథనంలో బలహీనతలు కనిపిస్తాయి.

మొత్తంగా చూస్తే "రాకాస" ఒక టైంపాస్ ఎంటర్‌టైనర్. బలమైన కథ, లాజిక్ ఆశించే వారికి నిరాశ కలిగించవచ్చు. కానీ నవ్వుల కోసం లైట్‌గా సినిమా చూడాలనుకునే వారికి మాత్రం ఇది ఓ సరైన ఎంపికగా నిలుస్తుంది.


**ఈ మూవీలో చెప్పుకోదగ్గవి..**
రాక్షసుడి బ్యాక్ స్టోరీ..

**ఈ మూవీలో మైనస్ ఇవే..**
కథ
స్క్రీన్ ప్లే
ఫస్టాఫ్
కామెడీ సీన్స్

**రేటింగ్ : 2/5**

చివరగా: రొటీన్ సినిమాలు ఇష్టపడే వాళ్లు ఈ సినిమా చూడచ్చు

-అజయ్ యాదవ్, ముద్ర




## రౌడీ జనార్దన స్పెషల్ పోస్టర్ రిలీజ్..


- అంచనాలు పెంచిన మూవీ టీమ్

**ముద్ర, సినిమా డెస్క్ :**

స్టార్ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న "రౌడీ జనార్దన" సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ విడుదలైంది. ఈ పోస్టర్‌తో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. యువ దర్శకుడు రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ యాక్షన్ డ్రామాగా పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాకు ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఆనంద్ సి చంద్రన్ పనిచేస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఈ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపింది. పోస్టర్‌లో కనిపించిన విజువల్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.

ఈ అప్డేట్‌తో విజయ్ దేవరకొండ అభిమానుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రౌడీ స్టార్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన మార్క్ చూపిస్తాడనే ఆశతో ప్రేక్షకులు ఈ సినిమాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## మిస్టికల్ థ్రిల్లర్ పోచమ్మ..




- గ్లింప్స్‌తో ఆసక్తి పెంచిన సిరీస్

**ముద్ర, సినిమా డెస్క్ :**

లీడింగ్ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహా మరో కొత్త వెబ్ సిరీస్ "పోచమ్మ"ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. మిస్టికల్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన ఈ సిరీస్ గ్లింప్స్ తాజాగా విడుదలై మంచి స్పందనను అందుకుంటోంది. అంబటి అర్జున్, శ్రీ పూజా రెడ్డి, స్నేహ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ ఈ నెల 17వ తేదీ నుంచి స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. శ్రుతి నాయుడు చిత్ర బ్యానర్‌పై ఈ సిరీస్‌ను నిర్మించగా, రమేష్ ఇంద్ర దర్శకత్వం వహించారు.

ఈ గ్లింప్స్‌ను విడుదల చేసిన దర్శకుడు బుచ్చిబాబు సాన, సిరీస్‌పై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గ్లింప్స్ చూస్తూనే గూస్‌బంప్స్ వచ్చాయని, ఇందులో ఉన్న కాన్సెప్ట్‌కు మంచి పాజిటివ్ వైబ్ కనిపిస్తోందని చెప్పారు. గ్రామ దేవతల పట్ల ఉండే భయం, గౌరవం రెండూ కూడా గ్లింప్స్‌లో బాగా ప్రతిబింబించాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సిరీస్ పెద్ద విజయాన్ని సాధించాలని, టీమ్ అందరికీ మంచి పేరు రావాలని ఆకాంక్షించారు. గ్లింప్స్‌లో థ్రిల్లింగ్‌తో పాటు డివైన్ ఎలిమెంట్స్‌ను ఆసక్తికరంగా చూపించారు. పోచమ్మ దేవత మహిమను అంచనా వేయకుండా తప్పులు చేసే వారిని ఎలా శిక్షిస్తుందో, ఆమెను విశ్వసించే వారిని ఎలా కాపాడుతుందో చూపించిన తీరు ఆకట్టుకుంటోంది. ఎల్వీ ముత్తుగణేష్ అందించిన నేపథ్య సంగీతం ఈ గ్లింప్స్‌కు మరింత బలాన్ని చేకూర్చింది. మొత్తం మీద మిస్టికల్ థ్రిల్లర్ కంటెంట్‌ను ఇష్టపడే ప్రేక్షకులను ఈ సిరీస్ బాగా ఆకర్షించేలా కనిపిస్తోంది.



## కయాదు లోహర్ క్లాసిక్ లుక్

- అలనాటి అందాల తార గెటప్‌లో మెరిసిన ముద్దుగుమ్మ

**ముద్ర, సినిమా డెస్క్ :**

కయాదు లోహర్ మరోసారి తన స్టైలింగ్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈసారి పాతకాల సినీ తారలను తలపించే సంప్రదాయ గెటప్‌లో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంది. ఈ ఫోటోషూట్‌లో ఆమె క్లాసిక్ లుక్‌తో పాటు ఆధునిక స్టైల్‌ను చక్కగా మేళవించి ప్రత్యేకంగా నిలిచింది. సింపుల్‌గా కనిపించినా శ్రద్ధగా డిజైన్ చేసిన బ్లౌజ్, అందమైన నెక్‌లైన్ మొత్తం లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. ఎలాంటి అధిక ఆర్భాటం లేకుండా సౌమ్యంగా కనిపించిన ఈ స్టైల్ ఆమె సహజ సౌందర్యాన్ని మరింత హైలైట్ చేసింది. ఈ క్లాసిక్ టచ్ చూసినవారిని ఆకట్టుకునేలా ఉంది. ఇక ఈ గెటప్‌కు తగినట్లుగా ఆమె ధరించిన ఇయర్‌రింగ్స్, లేయర్డ్ నెక్లెస్, తక్కువ బాంగిల్స్ లుక్‌కు మరింత అందాన్ని జోడించాయి. జుట్టును శుభ్రంగా సెట్ చేసుకుని, సాఫ్ట్ మేకప్‌తో కనిపించిన ఆమె మొత్తం స్టైలింగ్‌ను మరింత ఎలిగెంట్‌గా మార్చింది. ఈ ఫోటోలు ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరోసారి ప్రతిబింబిస్తున్నాయి.



## నబా నటేష్ పరువాల విందు

**ముద్ర, సినిమా డెస్క్ :**

నభా నటేష్ మరోసారి తన గ్లామర్ ఫోటోలతో సోషల్ మీడియాలో దుమారం రేపుతోంది. పలుచని చీరలో అందాలను ఆవిష్కరిస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇటీవలి కాలంలో సినిమాల్లో కనిపించకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం తన స్టైలిష్ లుక్స్‌తో ఎప్పటికప్పుడు ట్రెండ్‌లో నిలుస్తోంది. సుమారు 5 మిలియన్లకు పైగా ఫాలోవర్స్ ఉన్న నభా, తరచూ కొత్త ఫోటోషూట్‌లతో అభిమానులను అలరిస్తోంది. ప్రతి సారి భిన్నమైన స్టైల్‌తో ముందుకొచ్చే ఆమె, ఈసారి కూడా తన గ్లామర్‌తో అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. తాజా ఫోటోల్లో నల్లటి చీరకు ఎరుపు రంగు హెవీ డిజైన్ బ్లౌజ్‌ను జత చేసి అద్భుతంగా మెరిసింది. పలుచని శారీ ఆమె లుక్‌కు బోల్డ్ టచ్‌ను ఇస్తుండగా, బ్లౌజ్‌పై ఉన్న డీటైలింగ్ మొత్తం గెటప్‌కు రిచ్ ఫీలింగ్‌ను తీసుకువచ్చింది. ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com